


# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

Postal No: 3-78(D)-2026-2028

RNI APTEL 2013/54510



ESTD : 2012

పల్లె వెలుగు తెలుగు దినపత్రిక

ప్రకటనలు ఇవ్వబడును

ఎం. మహేష్ యాదవ్ 9440394488 9849499960



Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ | సంపుటి -14 | సంచిక - 297 | పేజీలు - 08 | వెల - 05/- | శనివారం 24-10-2026


## కాంగ్రెస్‌లో ప్రియాంక వర్సెస్ రాహుల్..

- రైహాన్ ఎగ్జిబిషన్ వివాదంపై రాహుల్ మౌనాన్ని ప్రశ్నించిన భండారీ
- ఈ వివాదంతో తన కుమారుణ్ని తెరపైకి తెచ్చేందుకు ప్రియాంక ప్రయత్నిస్తున్నారన్న భండారీ
- రాహుల్‌పై ప్రియాంకకు రాజకీయ విశ్వాసం తగ్గిందా? అని ప్రశ్న
- రైహాన్ వివాదంపై ఇప్పటి వరకు బహిరంగంగా స్పందించని రాహుల్



2

### చంద్రబాబు--పవన్ భేటీ..

# జెడ్పీ సీట్లపై కీలక చర్చ!

**నామినేషన్ల గడువు ముగుస్తుండటంతో ఆశావహుల్లో ఉత్కంఠ**

- రెబల్స్ బరిలో లేకుండా చర్యలపై చర్చ
- జనసేన, బీజేపీకి సీట్ల పెంపుపై కూటమి కసరత్తు
- స్థానిక బలాబలాల ఆధారంగా సీట్ల పంపకాల మార్పులు?
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌తోనూ చంద్రబాబు చర్చలు



స్థానిక ఎన్నికల వేళ రాష్ట్రంలో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. కూటమి– వైసీపీ మధ్య ఈ ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. వైసీపీ నామినేషన్ల వేళ చోటు చేసుకున్న ఘటన లపై సుప్రీంను ఆశ్రయించింది. సుప్రీం ఆదేశాలు ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. కాగా.. జెడ్పీటీసీ ఎన్నికలు కీలకంగా మారుతున్నాయి. ఈ పరిణామాల క్రమంలో సీఎం చంద్రబాబు తో డిప్యూటీ సీఎం పవన్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. తాజా పరిణామాల పై చర్చించారు. కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. స్థానిక ఎన్నికల వేళ రాజకీయం ఒక్క సారిగా కొత్త మలుపు తీసుకుంది. ఘర్షణలు.. కాల్పులు.. కేసుల వరకు వెళ్లింది. అటు మాజీ సీఎం జగన్ ప్రభుత్వం పైన మండిపడుతున్నారు. సుప్రీం కోర్టు ను ఆశ్రయించారు. మున్సిపల్ ఎన్నికలను రీ షెడ్యూల్ చేసారు. జెడ్పీటీసీ.. ఎంపీటీసీ ఎన్నికల కు ఈ రోజు నామినేషన్లకు చివరి రోజు. ఇక.. తాజా పరిణామాల పైన సీఎం చంద్రబాబు, పవన్ చర్చించారు. రెండో రోజు వరుసగా చంద్రబాబు ఇంటికి వచ్చిన పవన్ రాష్ట్రంలో చోటు చేసుకున్న పరిణామాలతో పాటుగా జెడ్పీ ఛైర్మన్ సీట్ల పంపకాల పైన చర్చ చేసినట్లు తెలుస్తోంది. ఈ చర్చల్లో ఎనిమిది జెడ్పీ స్థానాలను జనసేన కోరినట్లు సమాచారం. 28 జెడ్పీ సీట్లలో 8 సీట్లు ఇవ్వాలంటూ ప్రతిపాదనలు ఇచ్చినట్లు తెలుస్తోంది. మున్సిపల్ ఎన్నికల్లో కేవలం నాలుగు మేయర్ పదవులకే సరిపెట్టుకోవడంతో పాటు పలు చోట్ల కార్పొరేటర్లు, వార్డు సభ్యుల విషయంలో తగిన వాటా

మిగతా 2లో

## మహారాష్ట్రతో చర్చలకు రేవంత్

# సర్కార్ సిద్ధం!

- తుమ్మిడిహట్టి బ్యారేజీపై మహారాష్ట్రతో చర్చలకు సిద్ధం కావాలని ఆదేశం
- బ్యారేజీ ఎత్తు, ముంపు ప్రభావంపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని సూచన
- అక్టోబర్ 23 తర్వాత మహారాష్ట్ర సీఎంతో చర్చలు జరపనున్నట్టు వెల్లడి
- దిండి, అచ్చంపేట ఎత్తిపోతల పథకాల పనులను వేగవంతం చేయాలని ఆదేశాలు
- శ్రీశైలం నుంచి అదనపు నీటిని తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచన



రాష్ట్రంలోని కీలక సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణంపై మహారాష్ట్ర ప్రభుత్వంతో నిర్వహించనున్న చర్చలకు సర్వసన్నద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. రైతుల ప్రయోజనాలే పరమావధిగా ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయాలని ఆయన స్పష్టం చేశారు.

మిగతాది 2లో

# రాష్ట్రాభివృద్ధికి జగనే అడ్డంకి

**2024లోనే వైసీపీ పతనం మొదలైందని, స్థానిక ఎన్నికలతో భూస్థాపితం ఖాయమని జోస్యం**

- స్థానిక ఎన్నికలను ఆపేందుకు వైసీపీ 59 కేసులు వేసిందని ఆరోపణ
- 2021లో దౌర్జన్యాలతో 24% ఏకగ్రీవాలు చేసుకున్నారని వ్యాఖ్య
- కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తోందని స్పష్టీకరణ

మిగతాది 2లో



రాష్ట్ర అభివృద్ధిని, స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను అడ్డుకోవడమే వైసీపీ అధినేత జగన్ ఏకైక అజెండా

## మెటా గ్లాసెస్‌తో

### నాపై స్టింగ్ ఆపరేషన్‌కు యత్నం

- తనతో పాటు కేరళ సీఎం సతీశన్‌ను లక్ష్యంగా చేసుకుని స్టింగ్ ఆపరేషన్‌కు యత్నించారని డీకే ఆరోపణ
- పారిశ్రామికవేత్త మెటా స్మార్ట్ గ్లాసెస్ ధరించడం అనుమానాలకు కారణమైందని వెల్లడి
- ఆ వ్యక్తి పేరును, స్టింగ్ ప్రయత్నానికి సంబంధించిన ఆధారాలను బయటపెట్టని డీకే
- మంత్రులను ఇరికించే ప్రయత్నాలపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించినట్లు వెల్లడి
- సిద్ధరామయ్యకు సంబంధించిన స్టింగ్ వీడియోలపై కర్ణాటకలో రాజకీయ వివాదం



2

తనతో పాటు కేరళ సీఎం వీడీ సతీశన్‌ను లక్ష్యంగా చేసుకుని స్టింగ్ ఆపరేషన్ చేసేందుకు ప్రయత్నించారని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆరోపించారు. బీజేపీ, ఎన్డీయే కూటమి ముఖ్యమంత్రులపై కాకుండా కాంగ్రెస్ నేతలనే లక్ష్యంగా చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు.

## దేశ రాజకీయాల్లో కేసీఆర్ చక్రం తిప్పే

# రోజులు వస్తున్నాయి

- దేశ రాజకీయాల్లో కేసీఆర్ కీలకమయ్యే రోజులు వస్తున్నాయని వ్యాఖ్య
- రేవంత్ రెడ్డి పాలన తాత్కాలికమేనని, త్వరలో కేసీఆర్ సీఎం అవుతారని ధీమా
- కాంగ్రెస్, బీజేపీయేతర కూటమి దేశంలో కీలకపాత్ర పోషిస్తుందని జోస్యం
- కరెంట్ కోతలతో రైతులు ఇబ్బంది పడుతున్నారని ప్రభుత్వంపై విమర్శలు
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు యువత తగిన గుణపాఠం చెబుతుందన్న కేటీఆర్

మిగతాది 2లో



## ప్రజాస్వామ్యాన్ని ఖూనీ

# చేస్తున్నారు

- నామినేషన్ కేంద్రాల్లో వైసీపీ అభ్యర్థులపై దాడులు చేశారన్న జగన్
- వైసీపీ నేతలను గృహ నిర్బంధం చేస్తున్నారని మండిపాటు
- సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత కూడా ప్రభుత్వ వైఖరిలో మార్పు రాలేదని విమర్శ

మిగతాది 2లో




## ఇందిరమ్మ టవర్ల

### నిర్మాణంపై మంత్రి కీలక ఆదేశాలు

- హైదరాబాద్‌లో ఇందిరమ్మ టవర్ల కోసం యుద్ధప్రాతిపదికన భూములు గుర్తించాలని ఆదేశం
- మూడు దశల్లో లక్ష ఫ్లాట్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం
- ఈ నెలాఖరులోగా లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని మంత్రి పొంగులేటి సూచన



2

## మహిళా పోలీసుతో తోపులాట..

- పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో విడదల రజని, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం
- తన మద్దతుదారుడిని ఇంట్లోకి రానీయకపోవడంపై పోలీసులను నిలదీసిన వైనం



పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో శుక్రవారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. వైసీపీ నేత విడదల రజిని, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో రజని కిందపడిపోవడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. వివరాల్లోకి వెళితే.. ఎడ్లపాడు జెడ్పీటీసీ అభ్యర్థి బుల్లబ్బాయి,

మిగతాది 2లో

# మెటా గ్లాసెస్‌తో నాపై స్టింగ్ ఆపరేషన్‌కు యత్నం

కన్నడ వార్తా ఛానల్ ఏషియానెట్ సువర్ణ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ ఆరోపణలు చేశారు.
ఓ పారిశ్రామికవేత్త తనను కలిసేందుకు వచ్చినప్పుడు మెటా స్మార్ట్ గ్లాసెస్ ధరించి ఉండటంతో అనుమానం కలిగిందని డీకే శివకుమార్ తెలిపారు. అధికారుల ద్వారా అపాయింట్‌మెంట్ తీసుకున్న ఆ వ్యక్తి తొలుత వ్యాపార విషయాలు మాట్లాడారని, ఆ తర్వాత రాజకీయాలు, బూత్ స్థాయి వ్యూహాలు, రాజకీయ పరిణామాల గురించి చర్చ మొదలుపెట్టారని చెప్పారు. దీంతో ఆ వ్యక్తి నేపథ్యంపై విచారణ చేయాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు.
ఆ విచారణలో తనకు అందిన సమాచారం ప్రకారం.. ఆ పారిశ్రామికవేత్త కేరళ సీఎం వీడీ సతీశన్‌ను కలిసినప్పుడు కూడా అదే మెటా గ్లాసెస్ ధరించారని డీకే తెలిపారు. అయితే ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబును, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌ను, ఓ కేంద్ర మంత్రిని కలిసినప్పుడు మాత్రం వాటిని ధరించలేదని పేర్కొన్నారు.
"ఆ వ్యక్తి నా దగ్గరకు, సతీశన్ దగ్గరకు వచ్చినప్పుడే మెటా గ్లాసెస్ పెట్టుకున్నాడు" అని డీకే శివకుమార్ అన్నారు. అయితే ఆ పారిశ్రామికవేత్త పేరును వెల్లడించలేదు. రహస్యంగా చిత్రీకరించేందుకు ప్రయత్నించినట్లు నిర్ధారించే ఆధారాలను కూడా ఇంటర్వ్యూలో బయటపెట్టలేదు.
ఈ వ్యవహారంపై చర్యలు తీసుకోలేదన్న ప్రశ్నకు స్పందిస్తూ.. తాము అవసరమైన జాగ్రత్తలు తీసుకున్నామని, అయితే ఆ వివరాలను వెల్లడించడం లేదని చెప్పారు. తనకు అనుమానితుల గురించి సమాచారం అందిందని, మంత్రులు వ్యక్తిగత సహాయకులు, ఫోన్ కాల్స్ తదితర మార్గాల ద్వారా జరిగే ఉచ్చులో పడకుండా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించినట్లు తెలిపారు.
"మంత్రులు అప్రమత్తంగా ఉండాలని, మోసపోవద్దని చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వాధినేతగా నాపై ఉంది" అని డీకే అన్నారు. ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్నవారి పేర్లు, పత్రాలను సరైన సమయంలో బయటపెడతానని, ప్రస్తుతం వాటిని వెల్లడించే సమయం కాదని పేర్కొన్నారు.
కర్ణాటకలో మాజీ సీఎం సిద్ధరామయ్యకు సంబంధించినట్లు చెబుతున్న స్టింగ్ వీడియోల వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో డీకే వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 2011 నాటి వీడియోలను ఉపయోగించి సిద్ధరామయ్యను పదవి నుంచి తప్పించేందుకు ప్రయత్నించారని కేంద్ర మంత్రి, జేడీఎస్ నేత హెచ్‌డీ కుమారస్వామి ఆరోపించారు. అయితే సిద్ధరామయ్యను తొలగించేందుకు స్టింగ్ ఆపరేషన్ చేయించారన్న ఆరోపణలను డీకే ఖండించారు. కాంగ్రెస్ కూడా విపక్షాల ఆరోపణలను తోసిపుచ్చింది.
అక్టోబర్ 8న జరిగిన కేబినెట్ సమావేశంలో, మంత్రులను స్టింగ్ ఆపరేషన్ల ద్వారా ఇరికించే ప్రయత్నాలు జరగవచ్చని డీకే హెచ్చరించినట్లు సమాచారం. సుమారు పది మంది మంత్రులు, ముఖ్యమంత్రి కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకునేందుకు ఓ కేంద్ర మంత్రి, కర్ణాటక బీజేపీ నేత ప్రైవేటు ఏజెన్సీకి నిధులు సమకూర్చారని కాంగ్రెస్ ఎమ్మెల్యే రవి కుమార్ గణిగ ఆరోపించారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు ఉన్న పెన్‌డ్రైవ్ తన వద్ద ఉందని చెప్పారు.మరోవైపు, వివాదాస్పద వీడియోల ప్రసారాన్ని అడ్డుకోవాలని కోరుతూ సిద్ధరామయ్య బెంగళూరు కోర్టును ఆశ్రయించారు. పోలీసు విచారణ కూడా కోరారు. అక్టోబర్ 14న రెండు వీడియోల ప్రసారాన్ని నిలిపివేస్తూ మీడియా సంస్థలు, డిజిటల్ వేదికలకు కోర్టు మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. వీడియోల తయారీ, ప్రచారంపై పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది.

# దేశ రాజకీయాల్లో కేసీఆర్ చక్రం తిప్పే రోజులు వస్తున్నాయి

దేశ రాజకీయాల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కీలక పాత్ర పోషించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని, ఆయన జాతీయ స్థాయిలో చక్రం తిప్పే సమయం ఆసన్నమైందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వ హడావిడి కొద్దిరోజులు మాత్రమేనని, ఆ తర్వాత మళ్లీ కేసీఆరే ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన అంబర్‌పేట నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య నేతల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని కేటీఆర్ ఆరోపించారు. తీవ్రమైన విద్యుత్ కోతల వల్ల రైతులు అల్లాడుతున్నారని, వారి కష్టాలను పట్టించుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ఎల్‌నినో ప్రభావంపై నిపుణులు పది నెలల ముందే హెచ్చరించినప్పటికీ, ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడంలో విఫలమైందని మండిపడ్డారు. కాంగ్రెస్ హామీలను నమ్మి మోసపోయిన అన్ని వర్గాల ప్రజలు ఇప్పుడు మళ్లీ బీఆర్ఎస్ వైపే చూస్తున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి హడావిడి మరికొద్దిరోజులు మాత్రమే ఉంటుందని కేటీఆర్ పేర్కొన్నారు.జాతీయ రాజకీయాల గురించి ప్రస్తావిస్తూ, భవిష్యత్తులో కాంగ్రెస్, బీజేపీయేతర పార్టీలే దేశంలో నిర్ణయాత్మక పాత్ర పోషిస్తాయని కేటీఆర్ జోస్యం చెప్పారు. రాహుల్ గాంధీ ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆశించిన ఫలితం ఉండదని, అటు ప్రధాని మోదీ పాలనలోనూ దేశానికి చేకూరిన ప్రయోజనం ఏమీ లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం తెలంగాణ నుంచి గెలిచిన ఎంపీలెవరూ పార్లమెంటులో గళం విప్పడం లేదని ఆయన దుయ్యబట్టారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు యువత తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యాల వల్లే నేడు యువత రోడ్లపైకి వచ్చి పోరాటాలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతలు రాష్ట్ర అభివృద్ధిని విస్మరించి, కేవలం ప్రతిపక్షాలను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని ఆయన ఆరోపించారు.

# కాంగ్రెస్‌లో ప్రియాంక వర్సెస్ రాహుల్..

కాంగ్రెస్‌లో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ మధ్య అంతర్గత పోరు సాగుతోందని బీజేపీ ఆరోపించింది. ప్రియాంక కుమారుడు రైహాన్ వాద్రా ఫొటో ఎగ్జిబిషన్‌లో కొన్ని చిత్రాలను తొలగించిన వివాదంపై రాహుల్ గాంధీ స్పందించకపోవడాన్ని ఆ పార్టీ ప్రస్తావించింది. ఈ వివాదాన్ని సృష్టించి తన కుమారుడిని రాజకీయంగా తెరపైకి తీసుకొచ్చేందుకు ప్రియాంక ప్రయత్నిస్తున్నారని బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ విమర్శించారు. రాహుల్‌పై ప్రియాంకకు రాజకీయ విశ్వాసం తగ్గిందా? అని ప్రశ్నించారు. వ్యక్తిగత పర్యటన కోసం గత ఆదివారం వియత్నాం వెళ్లిన రాహుల్ గాంధీ.. రైహాన్ ఎగ్జిబిషన్ వివాదంపై ఇప్పటివరకు బహిరంగంగా స్పందించలేదు. ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ కాంగ్రెస్‌లో ప్రియాంక వర్సెస్ రాహుల్ పరిస్థితి నెలకొందని భండారీ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు.
అయితే, కొన్ని రోజుల క్రితమే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో రాహుల్, ప్రియాంక కలిసి పాల్గొన్న విషయం తెలిసిందే. ఢిల్లీలో ఇటీవల జరిగిన విద్యార్థుల నిరసనలకు సంబంధించిన ఫొటోలను తన ఎగ్జిబిషన్ నుంచి తొలగించారని కళాకారుడు, ఫొటోగ్రాఫర్ రైహాన్ వాద్రా బుధవారం వెల్లడించారు. 'నో ఐడియా ఈజ్ ఫైనల్' పేరుతో బికనీర్ హౌస్‌లో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఎగ్జిబిషన్ ప్రారంభానికి కొన్ని గంటల ముందు 105 ఫొటోల్లో 74 చిత్రాలను తొలగించాలని లేదా వాటి స్థానంలో వేరేవి పెట్టాలని నిర్వాహకులు కోరినట్లు రైహాన్ తెలిపారు. ప్రదర్శన ప్రారంభమయ్యే సమయానికి 35 ఫ్రేములు మాత్రమే మిగిలాయని చెప్పారు. ఈ చిత్రాల సేకరణ కోసం మూడేళ్లు కష్టపడ్డానని పేర్కొన్నారు. అక్టోబరు 15నే ఎగ్జిబిషన్ లేఅవుట్‌ను బికనీర్ హౌస్ యాజమాన్యానికి పంపించానని, దానికి సంబంధించిన అంగీకార సమాచారం కూడా అందిందని రైహాన్ వెల్లడించారు. చిత్రాల ఏర్పాట్లు ప్రారంభించిన తర్వాతే అభ్యంతరాలు వ్యక్తమయ్యాయని ఆయన తండ్రి రాబర్ట్ వాద్రా తెలిపారు.
మరోవైపు, తమ ప్రాంగణ విధానాలకు అనుగుణంగా లేవని గుర్తించిన ఫొటోలను తొలగించాలని కోరినట్లు బికనీర్ హౌస్ ప్రకటించింది. ఈ వివాదంపై స్పందించిన ప్రియాంక గాంధీ..
యువత గొంతును అణచివేసే ప్రయత్నంగా అభివర్ణించారు. రైహాన్ పంపిన ఇమెయిల్, ఎగ్జిబిషన్ ప్రతిపాదనకు సంబంధించిన స్క్రీన్‌షాట్లను బీజేపీ పంచుకుంది. జూన్ 10న పంపిన ప్రతిపాదనలో ప్రకృతి, వన్యప్రాణులు, అబ్‌స్ట్రాక్ట్ ఆర్ట్, పోర్ట్రెయిట్లు, శిల్పాల వంటి అంశాలే ఉన్నాయని భండారీ పేర్కొన్నారు. అందులో రాజకీయ అంశాల ప్రస్తావన లేదని అన్నారు. జూన్ 30న బికనీర్ హౌస్ ఈ ప్రతిపాదనను అంగీకరించిందని బీజేపీ తెలిపింది.
అక్టోబరు 21న బికనీర్ హౌస్ యాజమాన్యం రైహాన్‌కు నోటీసు పంపి 74 ఫొటోలను తొలగించాలని కోరినట్లు భండారీ పేర్కొన్నారు. తొలుత రాజకీయ అంశాలు లేని ప్రదర్శనకు అంగీకారం పొందిన తర్వాత, కుటుంబం ఒత్తిడితో రాజకీయ ఫొటోలను చేర్చి ఉంటారని ఆరోపించారు. ఈ ఇమెయిళ్లు, ప్రతిపాదనలు ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ చేస్తున్న వాదనల్లోని అసత్యాలను బయటపెడుతున్నాయని బీజేపీ విమర్శించింది.

# మహారాష్ట్రతో చర్చలకు రేవంత్ సర్కార్ సిద్ధం

ఈ సమావేశంలో ప్రధానంగా తుమ్మిడిహట్టి, దిండి, అచ్చంపేట ఎత్తిపోతల పథకాలపై చర్చించారు. తుమ్మిడిహట్టి బ్యారేజీని 152 మీటర్ల ఎత్తులో నిర్మిస్తే ఎల్లంపల్లి వరకు నీటిని తరలించే అవకాశం ఉంటుందని, అయితే దీనివల్ల సుమారు 2,300 ఎకరాల మేర ముంపునకు గురవుతుందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అదే 150 మీటర్ల ఎత్తులో నిర్మిస్తే ముంపు వెయ్యి ఎకరాల లోపే మాత్రమే ఉంటుందని తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం, మహారాష్ట్రలో ముంపు ప్రభావాన్ని అంచనా వేస్తూనే, తెలంగాణకు గరిష్ఠంగా నీటి లభ్యత ఉండేలా బ్యారేజీ డిజైన్‌ను రూపొందించాలని సూచించారు. అక్టోబర్ 23 తర్వాత చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు మహారాష్ట్ర ముఖ్యమంత్రి సంకేతాలిచ్చారని రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. ఇటీవల కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలో రెండు రాష్ట్రాల మధ్య జరిగిన సమావేశ వివరాలతో పాటు, సీడబ్ల్యూసీ కోరే ఎలాంటి సమాచారానికైనా సిద్ధంగా ఉండాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. దిండి ప్రాజెక్టుకు సంబంధించి ఏదుల రిజర్వాయర్ నుంచి 0.5 టీఎంసీలు, అచ్చంపేట ఎత్తిపోతల పథకానికి 0.1 టీఎంసీల నీటిని తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. శ్రీశైలం నుంచి అదనంగా 0.6 టీఎంసీల నీటిని తీసుకునేందుకు, శ్రీశైలం, నార్లాపూర్ నుంచి ఏదుల రిజర్వాయర్‌కు నీటిని మళ్లించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, డి. శ్రీధర్ బాబు, సాగునీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# చంద్రబాబు--పవన్ భేటీ.. జెడ్పీ సీట్లపై కీలక చర్చ!



ఈ చర్చల్లో ఎనిమిది జెడ్పీ స్థానాలను జనసేన కోరినట్లు సమాచారం. 28 జెడ్పీ సీట్లలో 8 సీట్లు ఇవ్వాలంటూ ప్రతిపాదనలు ఇచ్చినట్లు తెలుస్తోంది. మున్సిపల్ ఎన్నికల్లో కేవలం నాలుగు మేయర్ పదవులకే సరిపెట్టుకోవడంతో పాటు పలు చోట్ల కార్పొరేటర్లు, వార్డు సభ్యుల విషయంలో తగిన వాటా దక్కలేదని జనసేన కింది స్థాయి నేతలు అసంతృప్తితో ఉన్నారు.

జెడ్పీ స్థానాలపై కూటమి కసరత్తు

ఈ కారణంగానే పలు చోట్ల రెబల్స్ బరిలోకి దిగారు. దీంతో.. ఈసారి తమకు తగినన్ని స్థానాలు దక్కేలా పవన్ కల్యాణ్ చంద్రబాబుతో చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ఎంపీటీసీ, జడ్పీటీసీల ఎన్నికల్లో రెబెల్స్ లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవడంపైనా చర్చ జరిగినట్లు సమాచారం. అదే విధంగా బీజేపీకి సీట్ల కేటాయింపు పైన ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌తో చంద్రబాబు చర్చలు చేస్తున్నారు. జనసేనకు దాదాపు 20శాతం మేర, బీజేపీకి 7శాతం మేర సీట్లు కేటాయింపు జరిగింది. అయితే, జెడ్పీ ఎన్నికల్లో మాత్రం ఈ ఫార్ములా వద్దని నిర్ణయించారు. జనసేన, బీజేపీ ఇద్దరికీ సీట్ల పెంపు పైన ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. స్థానిక పరిస్థితులు, పార్టీల బలాబలాలను బట్టి సీట్ల పంపకాల్లో మార్పులు చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఇప్పటికే మూడు పార్టీల ఆశావహులు తమకు అవకాశం ఉన్న చోట్ల నామినేషన్లు దాఖలు చేయడంతో అధికారికంగా సీట్ల ఖరారు పైన అభ్యర్థుల్లో ఉత్కంఠ పెరుగుతోంది.

# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు

(మొదటి పేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని వైసీపీ అధినేత జగన్ ఆరోపించారు. రాష్ట్రంలో రావణకాసుర పాలన నడుస్తోందని ఆయన మండిపడ్డారు. నామినేషన్ కేంద్రాల వద్ద వైసీపీ అభ్యర్థులపై దాడులు చేసి, వారి నామినేషన్ పత్రాలను చించివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీ నేతలను పోలీసులు గృహ నిర్బంధం చేయడం, పోలీస్ స్టేషన్లకు పిలిపించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ అక్రమాలపై తాము ఆధారాలు సేకరించి రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ), గవర్నర్‌తో పాటు సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించామని తెలిపారు. తమ పిటిషన్‌పై స్పందించిన సుప్రీంకోర్టు, అభ్యర్థుల తుది జాబితా ప్రకటనను అక్టోబర్ 25 వరకు వాయిదా వేయాలని, నామినేషన్ల దాఖలుకు స్వేచ్ఛ కల్పించాలని, అభ్యర్థులకు రక్షణ, సీసీటీవీ రికార్డింగ్ ఏర్పాటు చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని జగన్ గుర్తుచేశారు. అయినప్పటికీ ప్రభుత్వ యంత్రాంగం వైఖరిలో ఎలాంటి మార్పు రాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 19 మున్సిపాలిటీలలో తమ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని, కానీ ఎస్ఈసీ కేవలం పరిమిత సంఖ్యలో కొన్ని చోట్ల మాత్రమే రీ-నామినేషన్లకు అవకాశం ఇచ్చిందని జగన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏకపక్ష విజయాల కోసం చంద్రబాబు నిబంధనలు మార్చుతున్నారని, ఇది మహాభారతంలోని మాయాజూదాన్ని తలపిస్తోందని ఆయన విమర్శించారు.

# ఇందిరమ్మ టవర్ల నిర్మాణంపై మంత్రి కీలక ఆదేశాలు

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో ప్రతిపాదించిన ఇందిరమ్మ టవర్ల నిర్మాణం కోసం యుద్ధప్రాతిపదికన భూములను గుర్తించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల కలెక్టర్లతో కలిసి 'క్యూర్' ఇందిరమ్మ టవర్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకాల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, క్యూర్ పరిధిలో మూడు దశల్లో మొత్తం లక్ష ఇందిరమ్మ ఫ్లాట్లను నిర్మించనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం కొనసాగుతున్న మొదటి దశతో పాటు, రెండు, మూడవ దశలకు అవసరమైన భూములను త్వరితగతిన సేకరించాలని అధికారులకు సూచించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ఈ నెలాఖరు నాటికి అత్యంత పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపిక కోసం నిర్వహించే లాటరీ ప్రక్రియను యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయాలని అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. నగరంలోని పేదలకు వారి నివాస ప్రాంతాలకు, ఉపాధి మార్గాలకు సమీపంలోనే గృహ వసతి కల్పించాలనేదే ఇందిరమ్మ టవర్ల ప్రధాన ఉద్దేశమని మంత్రి వివరించారు. పేదలను నగర శివార్లకు తరలించకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ పథకం కింద లబ్ధి పొందే వారికి ఫ్లాట్‌పై పూర్తి యాజమాన్య హక్కులతో పాటు, అవిభాజ్య భూమి వాటాను ఎటువంటి రిజిస్ట్రేషన్ ఛార్జీలు లేకుండా అందజేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్ల నిర్మాణానికి శంకుస్థాపనలు జరిగాయని, కొన్ని ప్రాంతాల్లో టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయిందని మంత్రి గుర్తుచేశారు. లబ్ధిదారుల అర్హతలను నిశితంగా పరిశీలించిన తర్వాత బహిరంగ డ్రాల ద్వారా ఎంపిక ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే లక్షలాది ఇళ్లను మంజూరు చేసిన ఇందిరమ్మ పథకంలో భాగంగా, పట్టణ ప్రాంత గృహ నిర్మాణానికి కూడా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. భూముల గుర్తింపుతో పాటు ఇతర అనుబంధ ప్రక్రియలను వేగవంతం చేసి, ప్రాజెక్టుల నిర్మాణ వేగాన్ని కొనసాగించాలని అధికారులను ఆదేశించారు.

# మహిళా పోలీసుతో తోపులాట..

(మొదటి పేజీ తరువాయి)

పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో రజని కిందపడిపోవడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. వివరాల్లోకి వెళితే.. ఎడ్లపాడు జెడ్పీటీసీ అభ్యర్థి బుల్లబ్బాయి, విడదల రజనిని కలిసేందుకు ఆమె నివాసానికి వచ్చారు. అయితే, ఇంటి గేటు వద్ద ఉన్న పోలీసులు బుల్లబ్బాయిని లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న రజని బయటకు వచ్చి, తమ మద్దతుదారుడ్ని ఇంట్లోకి ఎందుకు అనుమతించడం లేదని పోలీసులను తీవ్రస్థాయిలో ప్రశ్నించారు. ఈ సందర్భంగా చిలకలూరుపేట రూరల్ ఎస్ఐ ప్రియాంక, విడదల రజనికి మధ్య వాగ్వాదం జరిగింది. తన మద్దతుదారుడి నామినేషన్‌కు సంబంధించిన బీ-ఫారం తన వద్ద ఉందని, మూడు రోజులుగా తమ వారిని ఇలాగే ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. ఈ క్రమంలో ఎస్ఐ అడ్డుకునే ప్రయత్నం చేయడంతో తోపులాట జరిగి విడదల రజని పక్కకు పడిపోయారు. దీంతో విడదల రజని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా ఎస్ఐపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. "పిచ్చి పట్టిందా నీకు? నన్ను చంపుతావా నువ్వు? ఏం, మెంటలా నీకు? ఎవడు పంపించాడు నిన్ను ఇక్కడికి?" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనతో రజని నివాసం వద్ద కాసేపు ఘర్షణ వాతావరణం నెలకొంది. అనంతరం, ఆమె తన మద్దతుదారులతో కలిసి అక్కడే నిరసనకు దిగారు.౦

# రాష్ట్రాభివృద్ధికి జగనే అడ్డంకి

(మొదటి పేజీ తరువాయి)

2024లోనే వైసీపీ పతనం మొదలైందని, స్థానిక ఎన్నికలతో భూస్థాపితం ఖాయమని జోస్యం

రాష్ట్ర అభివృద్ధిని, స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను అడ్డుకోవడమే వైసీపీ అధినేత జగన్ ఏకైక అజెండా అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ధ్వజమెత్తారు. ఓటమి భయంతోనే జగన్ 'క్రిమినల్ లిటిగెంట్'గా మారి, న్యాయస్థానాలను అడ్డుపెట్టుకుని ఎన్నికలను నిలిపివేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఎన్నికలను ఆపేందుకు వైసీపీ 59 కేసులు వేసిందని ఆరోపించారు. శుక్రవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.



స్థానిక సంస్థలకు 16వ ఆర్థిక సంఘం నుంచి అందాల్సిన సుమారు రూ. 12,500 కోట్ల నిధులను రాకుండా చేయడమే జగన్ కుట్ర అని బొండా ఉమ మండిపడ్డారు. "నేడు ఎన్నికలు జరిగితే వైసీపీ అడ్రస్ గల్లంతు కావడం ఖాయం. అందుకే నామినేషన్ల ప్రక్రియ మొదలైన నాటి నుంచే దౌర్జన్యాలకు తెరలేపారు. పుంగనూరు, తిరుపతి, నగరి, రాయచోటి వంటి ప్రాంతాల్లో వాహనాలను తగలబెట్టడం, రాళ్లు, కర్రలతో దాడులు చేయడం వంటి అరాచకాలకు పాల్పడ్డారు. దీనికి సంబంధించిన వీడియో ఆధారాలు కూడా స్పష్టంగా ఉన్నాయి" అని ఆయన పేర్కొన్నారు. 2021 స్థానిక ఎన్నికల్లో వైసీపీ బెదిరింపులు, కిడ్నాపులు, హత్యాయత్నాలతో 24 శాతం స్థానాలను బలవంతంగా ఏకగ్రీవం చేసుకుందని బొండా ఉమ గుర్తుచేశారు. "పుంగనూరులో 85 స్థానాలకు గానూ 84, మాచర్లలో 77 స్థానాలకు గానూ 74 స్థానాలను ఏకగ్రీవం చేసుకున్న నీచ చరిత్ర జగన్‌ది. 2014లో చంద్రబాబు హయాంలో కేవలం 1 శాతం మాత్రమే ఏకగ్రీవమయ్యాయి. దొంగే దొంగ అన్నట్లుగా, తను చేసిన అరాచకాలను ఇతరులపై నెట్టే ప్రయత్నం జగన్ చేస్తున్నారు" అని విమర్శించారు. సొంత బాబాయిని హత్య చేయించి, 'నారాసుర రక్తచరిత్ర' పేరిట దుష్ప్రచారం చేసిన వ్యక్తి జగన్ అని, గతంలో ఇచ్చిన హామీల్లో 85 శాతం అమలు చేయకుండా ఇప్పుడు అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ 27 నెలల్లో రూ. 1,60,000 కోట్లను సంక్షేమానికి ఖర్చు చేస్తూ, ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటోందని అన్నారు. స్థానిక ఎన్నికల్లో పరాజయం తప్పదనే భయంతోనే జగన్ అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని, 2024లోనే వైసీపీ పతనం ప్రారంభమైందని, స్థానిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగితే ఆ పార్టీ భూస్థాపితం కావడం ఖాయమని బొండా ఉమ జోస్యం చెప్పారు.

# నంద్యాలలో ఎన్ని అడ్డంకులు సృష్టించినా వైఎస్ఆర్సిపి జెండా ఎగరవేస్తాం.

**ఎమ్మెల్సీ ఇషాక్ బాషా ధీమా.**

**15వ వార్డులో వైసీపీ అభ్యర్థి బైసాని రమేష్ బాబు గెలుపే లక్ష్యంగా ఎన్నికల ప్రచారం.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాలలో ఎన్ని అడ్డంకులు సృష్టించినా వైఎస్ఆర్సిపి



జెండా ఎగరవేస్తామని ఎమ్మెల్సీ ఇషాక్ బాషా ధీమా వ్యక్తం చేశారు. నంద్యాల 15వ వార్డులో వైఎస్ఆర్సిపి కౌన్సిలర్ అభ్యర్థి బైసాని రమేష్ బాబు విజయాన్ని కాంక్షిస్తూ ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని, ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారం సాగించారు. వైఎస్ఆర్సిపి అభ్యర్థులకు ప్రజలు మద్దతుగా నిలవాలని ఆయన కోరారు. నంద్యాల మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి చైర్మన్ అభ్యర్థి దాల్ మిల్ అమీర్‌తో పాటు 15వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి బైసాని రమేష్ బాబును ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్సీ ఇషాక్ బాషా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల మద్దతుతో నంద్యాలలో వైఎస్ఆర్సిపి ఘన విజయం సాధిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎంపీటీసీ, జెడ్పీటీసీ నామినేషన్ల దాఖలుకు ఆటంకాలు ఎదురైతే వెంటనే కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదు చేయండి.

**అభ్యర్థులకు నామినేషన్ల దాఖలులో ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు.**

**ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక అధికారి అందుబాటులో ఉంటారు.**

**కలెక్టరేట్ లోని కంట్రోల్ రూమ్ నంబర్: 78159 59525.**

**జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా.**



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే సమయంలో ఎలాంటి ఆటంకాలు ఎదురైనా, ఎవరైనా నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకున్నా, సంబంధిత అభ్యర్థులు వెంటనే జిల్లా కంట్రోల్ రూమ్ నంబర్ 78159 59525 ను సంప్రదించి ఫిర్యాదు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నామినేషన్ల దాఖలుకు సంబంధించి అభ్యర్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే గుర్తించి పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం అందుబాటులో ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

కంట్రోల్ రూమ్‌కు అందిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి, సమస్య పరిష్కారానికి ప్రత్యేక అధికారిని కేటాయించి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. నామినేషన్ల దాఖలు ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేలా సంబంధిత రిటర్నింగ్ అధికారులు చర్యలు చేపట్టాలని, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ సూచించారు. నామినేషన్లు దాఖలు చేయడంలో నిజంగా ఆటంకాలు ఎదుర్కొంటున్న అభ్యర్థులు తమ సమస్యలను నిర్భయంగా కంట్రోల్ రూమ్‌కు తెలియజేసి అధికారుల సహకారం పొందాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# నంద్యాల జిల్లాలో ప్రశాంతంగా, పారదర్శకంగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ల స్వీకరణ.

**జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్.**

పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. నంద్యాల జిల్లా వ్యాప్తంగా మొత్తం 28 మండలాల్లో జెడ్పీటీసీ



, ఎంపీటీసీ స్థానాలకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా కొనసాగుతోంది. అన్ని నామినేషన్ కేంద్రాల్లో ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత వాతావరణంలో నామినేషన్ల స్వీకరణ జరుగుతోంది. అన్ని రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం అభ్యర్థులను నామినేషన్ కేంద్రాల్లోకి అనుమతించి, టోకెన్లు జారీ చేస్తూ నామినేషన్ల ప్రక్రియను పూర్తి చేయిస్తున్నారు. అభ్యర్థులకు ఎక్కడైనా ఇబ్బందులు లేదా ఆటంకాలు ఎదురైతే, సంబంధిత నామినేషన్ కేంద్రంలోని పోలీసులను నేరుగా సంప్రదించాలని సూచించారు. అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నామినేషన్లు దాఖలు చేసేందుకు పోలీసులు పూర్తి సహకారం అందిస్తారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా పోలీసు శాఖ పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టిందని జిల్లా ఎస్పీ మీడియాకు వివరించడం జరిగింది.

## ఫిర్యాదు ఎవరికి చేసుకుంటే మాకేంటి ?

# తగ్గేదే లేదు.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికులకు ఇబ్బందికరంగా చేస్తున్న విషయాలను ఆర్టీసీ రాష్ట్ర ఏపీ జెఎండి, నంద్యాల జిల్లా ఆర్ఎం, నంద్యాల డిపో డిఎం దృష్టికి తీసుకువెళ్లిన ప్రయాణికుల సమస్యలు పరిష్కారం కావడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. వివరాల్లోకి వెళితే నంద్యాల జిల్లా ఆత్మకూర్ బస్టాండ్ డిపో బస్సు డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్న విషయం, నంద్యాల పట్టణంలోని ఎన్టీఆర్ షాదిఖాన వద్ద ఆత్మకూరు డిపో బస్సులు ప్రయాణికులు దిగడానికి బస్సులు నిలబెట్టడం లేదని పత్రికలలో వచ్చినప్పటికీ, పత్రిక కటింగ్ తో పాటు ప్రయాణికులు లిఖితపూర్వకముగా నంద్యాల జిల్లా ఆర్ఎం దృష్టికి తీసుకువెళ్లిన ఫలితం లేదు. మొన్నటికి మన్న ఆర్టీసీ రాష్ట్ర ఏపీ జే ఎం డి నంద్యాల ఆర్టీసీ బస్టాండ్ ఆకస్మిక తనిఖీలు చేస్తుండగా ఆత్మకూరు డిపో బస్సు కండక్టర్లు, డ్రైవర్లు నంద్యాల పట్టణంలోని ఎన్టీఆర్ షాదిఖాన వద్ద స్టాపింగ్ ఉన్న బస్సు నిలబెట్టడం లేదని, ప్రయాణికులు ఆర్టీసీ రాష్ట్ర ఏపీ జే ఎం డి దృష్టికి తీసుకో వెళ్లడం జరిగింది. ఆర్టీసీ రాష్ట్ర ఏపీ జే ఎం డి, నంద్యాల జిల్లా ఆర్ ఎం, కు వివరణ కోరగా ప్రతి డిపో డ్రైవర్లకు, కండక్టర్లకు కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగిందని, ప్రతి ఒక్క డ్రైవర్ స్టాపింగ్ ఉన్నచోట బస్సు స్టాపింగ్ చేసి ప్రయాణికులకు దింపి మళ్లీ ప్రయాణికులను ఎక్కించుకోవాలని సూచనలు ఇవ్వడం జరిగిందని చెప్పడం జరిగిందని తెలిపారు. కానీ ఈరోజు మళ్లీ అదే సమస్య ప్రయాణికులకు పునరావృతం కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు గురి అవుతూ రాష్ట్ర ఆర్టీసీ జే ఎం డీ, నంద్యాల జిల్లా ఆర్ఎం, నంద్యాల డిపో డిఎం దృష్టికి తీసుకువెళ్లిన ఫలితం లేదని మహిళలు వాపోతున్నారు. శుక్రవారం ఒక మహిళ నంద్యాల బస్టాండ్ నందు ఆత్మకూరు డిపో బస్సు ఎక్కి నంద్యాల పట్టణంలోని ఎన్టీఆర్ షాది ఖానా స్టాపింగ్ వద్ద బస్సు నిలబెట్టాలని చాలాసేపు మొరపెట్టుకున్న డ్రైవర్ విని విన్నట్టు ప్రయాణికులకు మహిళలని చూడకుండా చెరువు కట్ట వద్ద బస్సు నిలబెట్టి మహిళల ప్రయాణికులను దింపినట్లు మహిళా ప్రయాణికులు తెలిపారు. ఆత్మకూరు డిపో బస్సు డ్రైవర్లు, కండక్టర్లు ప్రతిరోజు ప్రయాణికుల పట్ల ఇలాగే ప్రవర్తిస్తున్నారని, ఎన్నిసార్లు వారిని రిక్వెస్ట్ చేసిన డ్రైవర్లు ఎన్టీఆర్ షాదిఖాన వద్ద నిలబెట్టడం లేదని, అక్కడ ఉన్న ప్రయాణికులకు కూడా ఎక్కించుకోవడంలేదని అన్నారు. ఏదేమైనా జిల్లా అధికారులు స్పందించి నంద్యాల పట్టణంలోని ఎన్టీఆర్ షాదిఖాన వద్ద ప్రయాణికులకు దించే విధంగా చర్యలు తీసుకోవాలని మహిళా ప్రయాణికులు కోరుతున్నారు.

# మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ తీరుపై విమర్శలు

పల్లె వెలుగు నంద్యాల క్రైమ్.



నంద్యాల జిల్లా కేంద్రంలో డ్రైవింగ్ లైసెన్ల మంజూరులో ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరిస్తూ, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శివశంకర్ చేతివాటంతో జేబులు నిలుపుకుంటున్నాడని డ్రైవింగ్ లైసెన్సు దారులనుండి విమర్శలు గుప్పుమంటున్నాయి. డ్రైవింగ్ లైసెన్సు కోసం డ్రైవింగ్ టెస్ట్ నిర్వహిస్తున్నప్పుడు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శివ శంకర్ నిర్లక్ష్యం వహిస్తూ డ్రైవింగ్ టెస్ట్ చేసేటప్పుడు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నచ్చినోనికి పాస్, నచ్చనోనికి ఫెయిల్



అన్న రీతిలో ప్రవర్తిస్తున్నారని పలువురు లైసెన్స్ దారులు తెలిపారు. మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ డ్రైవింగ్ టెస్ట్ డ్యూటీలో ఉన్నప్పుడు , ఏకపక్షరీతిగా వ్యవహరిస్తూ, తనకు నచ్చిన వారు డ్రైవింగ్ చేయలేకపోయినా పాస్ చేస్తున్నాడని, నచ్చని వారు నజరానా ఇవ్వనివారు డ్రైవింగ్ ఎంత మంచిగా చేసినా ఫెయిల్ చేస్తూ ఇబ్బందులు గురి చేస్తున్నాడని పలువురు డ్రైవింగ్ టెస్ట్ దారులు వాపోతున్నారు. టు వీలర్, లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ టెస్టో లేనిపోని ఆంక్షలతో డ్రైవింగ్ ముందుకు వెళ్లేటప్పుడు పాము మెలికల వలె వెళ్లి, రివర్స్ వచ్చేటప్పుడు పాము మెలికల వల్లే రివర్స్ రావాలని డ్రైవింగ్ టెస్ట్ దారులకు ఇబ్బందులు గురి చేస్తూ, లేనిపోని ఆంక్షలు విధిస్తున్నారని అంటున్నారు. హెవీ డ్రైవింగ్ చేసేటప్పుడు డ్రైవింగ్ చేస్తున్న వారి వైపు చూడకుండా ఎక్కడో చాటున ఉండి డ్రైవింగ్ చేస్తూ హెవీ డ్రైవింగ్ చేసేవారు స్ట్రైట్ గా ముందుకు వెళ్లి మళ్లీ స్ట్రైట్ గా వెనక్కి వచ్చే విధంగా డ్రైవింగ్ టెస్ట్ నిర్వహిస్తున్నారని, డ్రైవింగ్ చేస్తూ ఉండగానే తనకు నచ్చిన వారికి పాస్ అనే టిక్ మార్క్ చేసుకొని ఇంకా కొంతమంది డ్రైవింగ్ చేస్తూ ఉండగానే , గమనించకుండా డ్రైవింగ్ స్కూల్ కారులో కార్యాలయానికి వెళ్లిపోతున్నాడని తెలిపారు. డ్రైవింగ్ స్కూల్ ఆధ్వర్యంలో వచ్చిన డ్రైవింగ్ టెస్ట్ విద్యార్థులకు ప్రతి ఒక్కరికి పాస్ చేస్తూ, పక్షకపాత వైఖరిని అవలంబిస్తున్నారని డ్రైవింగ్ లైసెన్స్ దార్లు వాపోతున్నారు.డ్రైవింగ్ స్కూల్ యాజమాన్యంతో మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ శివ శంకర్ కు అవినాభావ సంబంధాలు ఉన్నాయని పలువురు చర్చించుకుంటున్నారు.

**నిష్పక్షపాతముగా డ్రైవింగ్ టెస్ట్**
**మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రవిశంకర్ .**

టు వీలర్, లైట్ మోటర్ వెహికల్, హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ టెస్టో నిష్పక్షపాతముగా డ్రైవింగ్ టెస్ట్ నిర్వహిస్తున్నారని, పాస్ అయిన వారికి పాస్ చేస్తూ, ఫెయిల్ అయిన వారికి ఫెయిల్ చేస్తున్నానని, డ్రైవింగ్ టెస్ట్ వచ్చిన వారి నుండి ఎటువంటి లావాదేవీలు ఆశించడం లేదని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రవిశంకర్ పేర్కొన్నారు. డ్రైవింగ్ టెస్టో నచ్చిన వారికి పాస్ చేస్తున్నానని, నచ్చని వారికి ఫెయిల్ చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నానన్న విషయం వాస్తవం కాదని తెలిపారు. 22వ తేదీ నిర్వహించిన డ్రైవింగ్ టెస్ట్ లలో టూ వీలర్ 25 మంది హాజరుకాగా 24 మంది పాసయ్యారని, ఒక్క వ్యక్తి ఫెయిల్ అయ్యారని అన్నారు. లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ టెస్టో 23 మంది హాజరు కాగా 11మంది పాస్ అయ్యారని, 12 మంది ఫెయిల్ అయినట్లు తెలిపారు. హెవీ డ్రైవింగ్ లైసెన్స్ లు 10 మంది హాజరు కాగా 3 పాస్ అయ్యారని, 7 మంది ఫైయిల్ అయ్యారని అన్నారు. నా వాహనం రిపేర్ రావడంతో డ్రైవింగ్ స్కూల్ వాహనంలో కార్యాలయానికి చేరుకున్నట్లు తెలిపారు . డ్రైవింగ్ స్కూల్ వాహన యజమానితో నాకు ఎటువంటి అవినాభావ సంబంధాలు లేవని అన్నారు. నేను డ్యూటీలో నిర్వహించిన డ్రైవింగ్ టెస్ట్ లలో పై అధికారులు పరిశీలించి నేను చేసిన టెస్టులలో అవకతవకలు జరిగి ఉంటే, ప్రభుత్వం నాపై ఎటువంటి చర్యలు తీసుకున్నా సిద్ధమేనని అన్నారు.

# జెడ్పిటిసికి న్యాయవాది తులసిరెడ్డి నామినేషన్





బండి ఆత్మకూరు పల్లె వెలుగు అక్టోబర్ 23: తెలుగుదేశం పార్టీ శ్రేణులు, బంధువులు, సన్నిహితులు, అభిమానుల సందడి మధ్య బండి ఆత్మకూరు మండల జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యుడిగా తెలుగుదేశం పార్టీ తరపున తాతిరెడ్డి తులసి రెడ్డి నామినేషన్ ను దాఖలు చేశారు. శుక్రవారం నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి తన నామినేషన్ ను సమర్పించారు. నంద్యాల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన తాతిరెడ్డి తులసిరెడ్డి ప్రముఖ న్యాయవాదిగా పేరు గడించారు. తెలుగుదేశం పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, రాష్ట్రస్థాయిలో పార్టీ కార్యదర్శిగా సేవలు అందిస్తున్నారు. న్యాయవాదిగా ప్రజా సమస్యల పరిష్కారంలో కృషి చేస్తూ, మరోవైపు రాజకీయవేత్తగా తెలుగుదేశం పార్టీ ఎదుగుదలలో ప్రధాన పాత్ర వహిస్తున్నారు. రాష్ట్ర మంత్రులు ఎన్ఎండి ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి తో పాటు, జిల్లాలోని అందరూ ఎమ్మెల్యేలతో తాతిరెడ్డి తులసిరెడ్డి సన్నిహిత సంబంధాలను కొనసాగిస్తున్నారు. తులసి రెడ్డి కి బండి ఆత్మకూరు మండలంలోని అందరూ నాయకులతోను సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తులసి రెడ్డి బండి ఆత్మకూరు మండలం జడ్పిటి సి స్థానానికి తెలుగుదేశం పార్టీ తరపున అభ్యర్థిగా నామినేషన్ వేయడంతో, ఆయన అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తులసి రెడ్డి నామినేషన్ల కార్యక్రమంలో బండి ఆత్మకూరు మండలానికి నాయకులు పాలుపంచుకున్నారు.

# శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి సింహగర్జన:
# “నేను సండే ఎమ్మెల్యే కాదు.. సత్తా ఉన్న లీడర్‌ను!”

**● నంద్యాల గడ్డపై వైఎస్ఆర్సిపి శ్రేణుల హోరు.. అభివృద్ధిపై మంత్రి ఫరూక్‌కు సూటి ప్రశ్న! ● “సండే ఎమ్మెల్యేనంటూ విమర్శిస్తారా? నంద్యాలను జిల్లా చేసింది ఎవరో చెప్పాలి!” ● మెడికల్ కాలేజీ, అమృత్ పథకం, వేల ఇళ్ల పట్టాలు.. నంద్యాలలో అభివృద్ధి చేసి చూపించింది శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డే! ● 40 ఏళ్ల రాజకీయ అనుభవమున్న మంత్రి ఫరూక్ నంద్యాలకు ఏం చేశారో సమాధానం చెప్పాలి. ● మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే విజ్ఞప్తి.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. “నేను సండే ఎమ్మెల్యే కాదు.. ప్రజల గుండెల్లో నిలిచిన సత్తా ఉన్న ఎమ్మెల్యేను!” అంటూ నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి నిప్పులు చెరిగారు. నంద్యాల మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని 2,3,4,12, 46,47 వార్డుల్లో ఆయన దూసుకుపోయారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన బహిరంగ సభల్లో శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి చేసిన ప్రసంగం నంద్యాల రాజకీయాల్లో ఇప్పుడు పెను ప్రకంపనలు సృష్టిస్తోంది.

ఈ ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, చైర్మన్ అభ్యర్థి అమీర్ భాషా (దాల్మిల్ అమీర్), స్థానిక కౌన్సిలర్ అభ్యర్థులు, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మంత్రి ఫరూక్ కు సూటి ప్రశ్న.... శిల్పా రవి రెడ్డి సంధించారు..."40 ఏళ్ల రాజకీయంలో మీరు చేసిందేంటి?"

ఈ సందర్భంగా ప్రత్యర్థులపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు శిల్పా రవిరెడ్డి. 40 సంవత్సరాల రాజకీయ అనుభవం ఉందని చెప్పుకునే మంత్రి ఫరూక్.. నంద్యాల అభివృద్ధికి ఏం చేశారో సూటిగా సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు.

ఎన్నికలు వస్తేనే మొఖం చాటేసే నాయకులను,





కష్టకాలంలో ప్రజల మధ్య లేని వాళ్లను ప్రజలు గమనించాలని కోరారు.

“సండే ఎమ్మెల్యే కాదు.. సత్తా ఉన్న లీడర్!”

తనను కొందరు ‘సండే ఎమ్మెల్యే’ అంటూ ఎద్దేవా చేస్తున్నారని, కానీ తాను చేతలతో చూపించిన సత్తా ఉన్న లీడర్ అని రవిచంద్ర కిషోర్ రెడ్డి గర్జించారు. కేవలం మూడు సంవత్సరాల కాల వ్యవధిలో నంద్యాలలో చేపట్టిన అభివృద్ధి చరిత్రే తన సాక్ష్యమని స్పష్టం చేశారు.

నంద్యాలలో శిల్పా రవి హయాంలో జరిగిన అభివృద్ధి ఇదీ:

నంద్యాలను ప్రత్యేక జిల్లా కేంద్రంగా మార్చడం.

పట్టణ ప్రజల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారంగా ‘అమృత్ పథకం’ తేవడం.

అత్యాధునిక సౌకర్యాలతో మెడికల్ కళాశాల, ఉర్దూ కళాశాల, ఐటీఐ కళాశాల, మహిళా జూనియర్ కళాశాలల ఏర్పాటు.

పేదల కోసం ఏకంగా 5,500 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ.

పట్టణంలో 8 పార్కులు, 5 అర్బన్ హెల్త్ సెంటర్లు, గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, మిల్క్ కేంద్రాల నిర్మాణం.

నాడు-నేడు’ కింద ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చడం, ప్రతి సందులోనూ సీసీ రోడ్లు, కలెక్టర్ బంగ్లా, జేసీ బంగ్లా, పద్మావతి నగర్ రోడ్ల నిర్మాణం.

కష్టకాలంలో ఆదుకున్న వైఎస్ఆర్సిపిని గెలిపించండి!

కరోనా మహమ్మారి విలయతాండవం చేసిన కష్టకాలంలో పేద ప్రజలకు అండగా నిలిచింది ఎవరో ప్రజలు గుర్తుంచుకోవాలని శిల్పా రవిరెడ్డి కోరారు. గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వ హయాంలో ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందాయని గుర్తుచేశారు.

కానీ, నేడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ‘సూపర్ సిక్స్’ హామీలను గాలికొదిలేసిందని మండిపడ్డారు. మాయమాటలతో అధికారంలోకి వచ్చి, నేడు నంద్యాల పట్టణాభివృద్ధిని పూర్తిగా గాలికొదిలేశారని ధ్వజమెత్తారు.

అమీర్ బాషను భారీ మెజారిటీతో గెలిపించండి!

నంద్యాల మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థిగా బరిలో ఉన్న అమీర్ బాష (దాల్మిల్ అమీర్) తో పాటు, 4వార్డు వైసీపీ అభ్యర్థి పురందర్ కుమార్, 12వార్డు అభ్యర్థి మస్తాన్ బాబా,3వార్డు వైసీపీ అభ్యర్థి అమీర్,46 వార్డు వైసీపీ అభ్యర్థి సాధిక్ బాషా, 2వార్డు వైసిపి అభ్యర్థి మునయ్య, 47వ వార్డు వైసిపి అభ్యర్థి కాల్వ ఆశీనా ను వైసిపి ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు...

52 వార్డువార్డుల్లో పోటీ చేస్తున్న వైఎస్ఆర్సిపి కౌన్సిలర్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. నంద్యాల ప్రగతి మరింత ముందుకు సాగాలంటే వైఎస్ఆర్సిపి జెండా ఎగరాలని, ప్రజలంతా అమూల్యమైన ఓట్లతో ఫ్యాన్ గుర్తును గెలిపించి పట్టణాభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## పోలీసుల చర్యలతో ప్రశాంతంగా నామినేషన్లు

బండి ఆత్మకూరు పల్లె వెలుగు అక్టోబర్ 23: బండి ఆత్మకూరు మండలంలో మండల



ప్రాదేశిక సభ్యులకు సంబంధించిన నామినేషన్లకు శుక్రవారం సాయంత్రం తెర పడింది. ఈనెల 21 నుండి ఎంపీటీసీ సభ్యుల నామినేషన్ల కార్యక్రమం ప్రారంభమైంది. శాంతిభద్రతల పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి నామినేషన్లు ప్రశాంతంగా జరిగే విధంగా చర్యలు చేపట్టారు. జిల్లా పోలీస్ యంత్రాంగం కూడా ఈ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి వహించింది. నామినేషన్లకు ముందు రోజే నంద్యాల ఏఎస్పీ సుస్మిత రంగనాథన్ బండి ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. అభ్యర్థులు నామినేషన్లు వేసే ప్రాంతాన్ని పరిశీలించి వెళ్లారు. తిరిగి ఈనెల 22వ తేదీన ఏఎస్పీలు ఖాదర్ భాష, సుస్మిత రంగనాథన్ , బండి ఆత్మకూరుకు వచ్చి నామినేషన్ల పరిస్థితిని సమీక్షించారు. నంద్యాల టూ టౌన్ సిఐ సుధాకర్ రెడ్డి, బండి ఆత్మకూరు ఎస్సై జగన్మోహన్, పోలీస్ సిబ్బందితో కలిసి నామినేషనన్ల పర్వం ప్రశాంతంగా జరిగేందుకు చర్యలు తీసుకున్నారు. మూడు రోజులపాటు జరిగిన ఈ నామినేషన్ల పర్వం ప్రశాంతంగా ముగిసింది. దాదాపు 30 మంది పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. శనివారం నాడు నామినేషన్లకు సంబంధించి పరిశీలన కార్యక్రమం జరుగుతున్న కారణంగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఎస్ఐ జగన్మోహన్ శుక్రవారం సాయంత్రం పేర్కొన్నారు. ఈ ఎన్నికలలో ఆటంకం కలిగించే వ్యక్తులను గుర్తించి అటువంటి వారిపై ఇప్పటికే 60 మంది పై బైండోవర్ కేసులు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు.ం

## హాచోల్లి డిస్ట్రిబ్యూటర్ కాలువలో చెత్తాచెదారం.. కళేబరాలతో దుర్వాసన!

**కాలువలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు -- ప్రజారోగ్యంపై ఆందోళన**

హోళగుంద పల్లె వెలుగు అక్టోబర్ : 23 తుంగభద్ర దిగువ కాలువ (ఎల్ఎల్సీ) నుంచి



ప్రవహిస్తున్న హాచోల్లి డిస్ట్రిబ్యూటర్ కాలువలో చెత్తాచెదారం, ప్లాస్టిక్ బాటిళ్లు, ఇతర వ్యర్థాలు భారీగా పేరుకుపోయాయి. దీనికి తోడు గొర్రెలు, కుక్కల కళేబరాలు కాలువలో పడేయడంతో పరిసర ప్రాంతాల్లో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో కాలువ పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.కాలువలో నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడటంతో పాటు, వ్యర్థాలు కుళ్లిపోవడం వల్ల దోమలు, ఈగలు పెరిగి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాలకు సమీపంలోనే కాలువ ఉండటంతో రైతులు సైతం ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది.సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించాలని, గొర్రెలు, కుక్కల కళేబరాలను సురక్షితంగా తొలగించే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. కాలువలో చెత్త వేయకుండా పర్యవేక్షణ చేపట్టి, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు శాశ్వత చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ సమస్యపై ఎల్ఎల్సీ జేఈ ఉషను వివరణ కోరగా, కాలువను త్వరలోనే శుభ్రం చేయిస్తామని ఆమె తెలిపారు. కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి, పరిసర ప్రాంతాల్లో దుర్వాసన సమస్యను తగ్గించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

## జిల్లాలో మూడవరోజు జడ్పిటిసి/ ఎంపిటిసి నామినేషన్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా ఎస్పీ..

**● నామినేషన్ కేంద్రాల వద్ద విధించిన ఆంక్షలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలి.. ● నామినేషన్ ప్రక్రియ పూర్తి అయ్యేవరకు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ అధికారులకు ఆదేశాలు. ● జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ ఐపీఎస్.**





పల్లె వెలుగు నంద్యాల జిల్లా క్రైమ్. నంద్యాల జిల్లాలో మూడవరోజు కొనసాగుతున్న ఎంపిటిసి/జడ్పిటిసి నామినేషన్ల ప్రక్రియను క్షేత్రస్థాయిలో నంద్యాల కళాశాల నందు గల నామినేషన్ కేంద్రాన్ని మరియు శిరివెళ్ల ,రుద్రవరం పోలింగ్ కేంద్రాలను స్వయంగా సందర్శించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలో జరగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉంటూ కట్టుదిట్టమైన భద్రత నిర్వహించాలని మరియు నామినేషన్ల సరళి పరిశీలించి నిరంతరం సిసి కెమెరాల పర్యవేక్షణ , వీడియోగ్రఫీ అవసరమైతే నామినేషన్ పరిసర ప్రాంతాలను డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా నామినేషన్ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా విధించిన ఆంక్షలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ సూచించారు. నామినేషన్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో అనవసరంగా గుమిగూడడం, ర్యాలీలు నిర్వహించడం, అధిక సంఖ్యలో మద్దతుదారులను వెంట తీసుకురావడం వంటి చర్యలకు పాల్పడరాదని స్పష్టం చేశారు.

జిల్లాలో ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాలకు చెందిన ప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ కోరారు. ఎన్నికల విధుల నిర్వహణలో పోలీసు శాఖకు సహకరిస్తూ, ఎన్నికల నిబంధనలను కచ్చితంగా అమలు చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం అనుమతి పొందిన వాహనాలు, వ్యక్తులకు మాత్రమే నామినేషన్ కేంద్రాల వద్దకు ప్రవేశం ఉంటుందని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాలని, వందనాలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## 29 ఎంపీటీసీ స్థానాలకు 59 నామినేషన్లు



బనగానపల్లె, అక్టోబర్ 23, పల్లెవెలుగు బనగానపల్లె మండలంలో 29 ఎంపీటీసీ స్థానాలకు మూడవరోజు 59 నామినేషన్ లో దాఖలు అయినట్లు రిటర్నింగ్ అధికారి సుధాకర్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో 29 ఎంపీటీసీ స్థానాలకు టిడిపి అభ్యర్థులు 28 మంది, వైసీపీ పార్టీ అభ్యర్థులు 29 మంది, ఇద్దరూ జనసేన పార్టీ నుండి నామినేషన్ వేసినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి తెలిపారు. టంగుటూరు ఎంపీటీసీ స్థానానికి టిడిపి అభ్యర్థి ఆకుమల్ల వెంకటమ్మ ఒక నెల చంటి బిడ్డని ఎత్తుకొని నామినేషన్ వేసేందుకు ఎంపీడీవో కార్యాలయానికి వచ్చారు చంటి బిడ్డతో నామినేషన్ వేశారు. పలుకూరు-1 ఎంపీటీసీ స్థానం నుండి టిడిపి ఎంపీపీ అభ్యర్థి గుండం మీనా కుమారి, పలుకూరు-2 ఎంపీటీసీ స్థానం నుండి వైసీపీ అభ్యర్థి గుండం దీపిక ,పాతపాడు ఎంపీటీసీ స్థానం నుండి టిడిపి అభ్యర్థిగా బెడదల మహేశ్వరరెడ్డి నామినేషన్లు వేశారు.బనగానపల్లె-1 స్థానం నుండి బొబ్బల రామ మద్దిలేటి రెడ్డి, బనగానపల్లె-3 స్థానం నుండి రాయలసీమ సలాం, బనగానపల్లె-6 స్థానం నుండి కొంగని విజయ కుమార్ యాదవ్ ,బనగానపల్లె-8 స్థానం నుండి జక్కు రామాంజనేయులు టిడిపి అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు .తిమ్మాపురం ఎంపీటీసీ స్థానం నుండి వైసీపీ అభ్యర్థి అల్లే సురేష్ రెడ్డి ,నందవరం ఒకటవ స్థానం నుండి వైసీపీ అభ్యర్థిగా శేఖర్ గౌడ్ నామినేషన్లు వేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగరాజు తహసిల్దార్ చంద్రశేఖర్ డిప్యూటీ ఎంపీడీవో సురేంద్రనాథ్ యాదవ్ పాల్గొన్నారు

## టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థిగా అక్క మహాదేవి నామినేషన్ దాఖలు,,,,,,

నందవరం పల్లె వెలుగు అక్టోబర్ 23 నందవరం



మండలం జడ్పీటీసీ స్థానానికి తెలుగుదేశం పార్టీ (టీడీపీ) అభ్యర్థిగా అక్క మహాదేవి నామినేషన్ దాఖలు చేశారు. ఎమ్మెల్యే డా. బి.వి. జయనాగేశ్వర రెడ్డి ఆశీస్సులతో, కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు భాస్కర్ల చంద్రశేఖర్ సహకారంతో ఆయన నామినేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. టీడీపీ నాయకత్వం సూచనల మేరకు అభ్యర్థిగా బరిలో నిలిచిన అక్క మహాదేవి నందవరం మండల అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. ఈ సందర్భంగా పార్టీ నందవరం మండలం కన్వీనర్ కాశీం వలి నందవరం మండల సింగిల్ విండో చైర్మన్ ధర్మాపురం గోపాల్. కనకవీడు గ్రామ అధ్యక్షులు డబ్బా ఈరన్న. పులిచింత నాయకులు, కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, మండల నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జులు, ఇతర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బండి ఆత్మకూరులో 28 నామినేషన్లు





బండి ఆత్మకూరు పల్లె వెలుగు అక్టోబర్ 23: బండి ఆత్మకూరు మండలంలో ఎంపీటీసీ సభ్యులకు సంబంధించి వివిధ పార్టీలకు చెందిన 28 మంది సభ్యులు నామినేషన్లను వేశారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి లీలావతి శుక్రవారం రాత్రి పేర్కొన్నారు. కడమల కాలువ ఎంపీటీసీ (బీసీ మహిళ) కు సంబంధించి భారతీయ జనతా పార్టీ మండల ఉపాధ్యక్షురాలు మేకల చరిత ద్వారా, ఆ పార్టీ నియోజకవర్గపు ఇన్చార్జి మోమిన్ షబానా మద్దతు తెలుపుతూ నామినేషన్ను దాఖలు చేశారు. ఏ కోడూరు ఎంపీటీసీ (ఎస్సీ మహిళ) స్థానానికి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలారెడ్డి ఆదేశాల మేరకు, డిసిసి జిల్లా నాయకులు లక్ష్మీ నరసింహ మద్దిలేటి ల ప్రోత్సాహం మేరకు పబ్బతి అనిత మేరీ తన నామినేషన్ను ఎన్నికల అధికారికి సమర్పించారు. పార్టీలకు సంబంధించి తెలుగుదేశం పార్టీ ద్వారా ఆరు, వైయస్సార్సీపీకి 9, బిజెపికి ఆరు జనసేనకు మూడు, సిపిఎం ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీల తరపున ఒక్కొక్కటి, ఇతరులు రెండు నామినేషన్లను వేశారు. గ్రామాల వారీగా కడమల కాల్వకు రెండు సంత జుట్టు ఒకటి బికోడూరు ఐదు సింగవరం ఒకటి ఏకోడూరు మూడు పెద్దదేవరాపురం 2 , భోజనం ఒకటి చిన్నదేవలాపురం 4 జి లింగాపురం 2 బారిన పల్లె ఒకటి బండి ఆత్మకూరు ఒకటిలో నాలుగు బండి ఆత్మకూరు నామినేషన్లు దాఖలు అయ్యాయని ఎన్నికల అధికారి పేర్కొన్నారు. మండలంలో మూడు రోజులపాటు 94 నామినేషన్లు దాఖలు అయ్యాయని ఎన్నికల అధికారులు పేర్కొన్నారు.

# ఎన్నికల నేపథ్యంలో పిన్నపురంలో పోలీసుల కాలినడకన పెట్రోలింగ్..



పాణ్యం అక్టోబర్ 23 పల్లె వెలుగు : రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో పాణ్యం మండలంలోని సున్నితమైన ప్రాంతమైన పిన్నపురం గ్రామంలో పోలీసులు కాలినడకన పెట్రోలింగ్ నిర్వహించారు.పాణ్యం సీఐ కిరణ్ కుమార్ రెడ్డి, ఎస్సై నరేంద్ర కుమార్ రెడ్డి సిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించారు.ఈ సందర్భంగా గ్రామస్థులతో సమావేశాలు నిర్వహించి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసులకు సహకరించాలని గ్రామస్థులకు సూచించారు.

# శ్రీ చౌడేశ్వరి దేవస్థానానికి విరాళం



బనగానపల్లె , అక్టోబర్ 23, పల్లెవెలుగు మండలంలోని నందవరం శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానానికి కడప పట్టణానికి చెందిన కీ" శే" కంబగిరి శివకుమార్ యాదవ్ జ్ఞాపకార్థం వారి కుమారుడు కంబగిరి నందన్ యాదవ్, వారి కుటుంబ సభ్యులు ఆలయ అభివృద్ధి కొరకు 25,116/-రూ" చందాను ఆలయ డెవలప్ మెంట్ కమిటీ చైర్మన్ పి.వి.కుమార్ రెడ్డి ,ఆలయ కమిటీ చైర్మన్ పి.వి. నాగార్జున రెడ్డి ల సమక్షంలో ఆలయ అర్చకులకు శుక్రవారం అందచేశారు.

# ఘనంగా చౌడేశ్వరి దేవి పల్లకి సేవ మహోత్సవం





బనగానపల్లె, అక్టోబర్ 23, పల్లెవెలుగు మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవస్థానంలో పల్లకి సేవ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు . శుక్రవారం మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవి దేవస్థానంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, ఆలయ చైర్మన్ పి.వి. నాగార్జున రెడ్డి ల ఆధ్వర్యంలో పల్లకి సేవ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. చౌడేశ్వరి దేవి ఉత్సవ విగ్రహానికి పూజలు నిర్వహించి ఆలయ ప్రాంగణంలో పల్లకిలో ఊరేగింపు నిర్వహించారు .భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని ప్రత్యేక పూజలు నిర్వహించారు

# ఎమ్మిగనూరు పట్టణ అభివృద్ధి, ప్రజాసేవే నా లక్ష్యం.,,,,,

**● మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ డి. నజీర్ అహమ్మద్,,,,, ● మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా, 9వ వార్డు కౌన్సిలర్ ,,,,, ● అభ్యర్థిగా స్వతంత్ర బరిలో నజీర్ అహమ్మద్,,,,,, ● గ్యాస్ సిలిండర్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి,,,,**



ఎమ్మిగనూరు, పల్లె వెలుగు అక్టోబర్ 23 ఎమ్మిగనూరు పట్టణ అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా మున్సిపల్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ డి. నజీర్ అహమ్మద్ ప్రజల ఆశీర్వాదాన్ని కోరారు. మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా, 9వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గ్యాస్ సిలిండర్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

గతంలో మున్సిపల్ వైస్ చైర్మన్గా పనిచేసిన సమయంలో ఎమ్మిగనూరు పట్టణానికి, ప్రజలకు తాను అందించిన సేవలను నజీర్ అహమ్మద్ గుర్తుచేశారు. తన తండ్రి కూడా గతంలో ఎమ్మిగనూరు మున్సిపల్ వైస్ చైర్మన్గా పట్టణ ప్రజలకు సేవలందించారని, తమ కుటుంబానికి దశాబ్దాల రాజకీయ నేపథ్యం ఉందని తెలిపారు. తమ కుటుంబం ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి, పట్టణ అభివృద్ధికి తనవంతు కృషి చేసిందని పేర్కొన్నారు. తమ కుటుంబం గతంలో అందించిన సేవలను, పట్టణ అభివృద్ధి కోసం చేసిన కృషిని ప్రజలు గుర్తించాలని కోరారు.

ప్రజాప్రతినిధిగా పదవిని అధికారంగా కాకుండా ప్రజలకు సేవ చేసే బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. ఎమ్మిగనూరు పట్టణంలో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు తదితర మౌలిక సదుపాయాల మెరుగుదలకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పట్టణ అభివృద్ధికి తనవంతు కృషి చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని, ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తూ ప్రజలకు జవాబుదారీగా పనిచేసే నాయకత్వం అవసరమని నజీర్ అహమ్మద్ అన్నారు. అహంకారపూరిత ధోరణులకు కాకుండా ప్రజల ఆత్మగౌరవానికి, ప్రజాసేవకు, అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మిగనూరు పట్టణ ప్రజలు, ముఖ్యంగా 9వ వార్డు ఓటర్లు తమ కుటుంబంపై ఉన్న ఆదరాభిమానాలను మరోసారి చూపించి, పట్టణ అభివృద్ధి కోసం పనిచేసే అవకాశం కల్పించాలని కోరారు. దేవుని ఆశీస్సులతో, ప్రజల అభిమానంతో మరింత బాధ్యతగా సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. తనను మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా, 9వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా ఆదరించి, గ్యాస్ సిలిండర్ గుర్తుపై మీ విలువైన ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించి, మీకు సేవ చేసే భాగ్యాన్ని కల్పించాలని నజీర్ అహమ్మద్ ప్రజలను మనస్ఫూర్తిగా అభ్యర్థించారు.బి

# మాజీ ఎమ్మెల్యే కాటసాని గృహనిర్బంధం




బనగానపల్లె, అక్టోబర్ 23, పల్లెవెలుగు పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నివాసంలో ఆయనను గృహనిర్బంధం చేశారు శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామి రెడ్డికి ఎస్సై దుగ్గిరెడ్డి ఇంటి నుండి బయటకు వెళ్ళవద్దని నోటీసులు ఇచ్చారు . బయటికి వెళ్లకుండా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం స్థానిక ఎన్నికలను రావణ కష్టాల మార్చిందని విమర్శించారు .వైసిపి అభ్యర్థులు ఎంపీటీసీ, జడ్పీటీసీ నామినేషన్లు వేయకుండా పోలీసుల సహకారంతో కూటమి నాయకుల అడ్డుకుంటున్నారని తెలిపారు కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాలలో ప్రజలకు మంచి చేసి ఉంటే స్వచ్ఛందంగా ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడగాలని వైసీపీ నాయకులు, కార్యకర్తలు నామినేషన్ వేయకుండా నామినేషన్ల పత్రాలను చించి వేయడం దారుణం అన్నారు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరగకుండా టిడిపి నాయకులు పోలీసుల సహకారంతో అడ్డుకుంటున్నారని విమర్శించారు . కూటమి నాయకులు రాష్ట్రంలో దౌర్జన్యాలు విద్వాంసాలు చేస్తున్న ఎన్నికల కమిషన్ పట్టించుకోవడంలేదని విమర్శించారు నామినేషన్ వేయడానికి వెళ్లిన వైసీపీ నాయకులు, కార్యకర్తల నామినేషన్లు లాక్కొని చించి వేసి దాడులు చేస్తూ, వాహనాలకు నిప్పు అంటిస్తున్న ఎన్నికల కమిషన్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సుప్రీంకోర్టులో కేసు వేసిన సుప్రీంకోర్టు నిబంధనలను ఎన్నికల కమిషన్ ,పోలీసులు అమలు చేయడం లేదన్నారు. కూటమి నాయకులకు వత్తాసు పలుకుతున్న అధికారుల పేర్లు డిజిటల్ బుక్ లో నమోదు చేస్తున్నామని,కూటమి నాయకులకు తలొగ్గి వత్తాసు పలుకుతున్న ఏ ఒక్క అధికారిని 2029 లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. దౌర్జన్యాలతో అక్రమంగా ఎన్నికైన ఎంపీటీసీ జడ్పిటిసి సభ్యులను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాజీనామా చేయిస్తామని హెచ్చరించారు.

# మహానంది మండలంలో ముగిసిన ఎంపీటీసీ నామినేషన్లు

**చివరి రోజు అభ్యర్థుల జోరు.. మొత్తం 72 నామినేషన్లు.**





మహానంది, పల్లె వెలుగు మహానంది మండలంలో ఎంపీటీసీ నామినేషన్ల పర్వం ముగిసింది. శుక్రవారం నామినేషన్ల దాఖలుకు చివరి రోజు కావడంతో అభ్యర్థులు జోరుగా నామినేషన్లు వేశారు. మండలంలో 11 ఎంపీటీసీ స్థానాలకు చివరి రోజు 44 నామినేషన్లు దాఖలయ్యాయని రిటర్నింగ్ ఆఫీసర్ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. వైసీపీ -23,టీడీపీ-9, బిజెపి-1, జనసేన-10, సిపిఐ-1 నామినేషన్లు వేశారన్నారు. మొత్తం మూడు రోజులకు 72 నామినేషన్లు దాఖలు అయ్యాయని తెలిపారు.నంద్యాల రూరల్ సీఐ శ్రీనివాసులు రెడ్డి, మహానంది ఎస్సై శివాంజల్ ల ఆధ్వర్యంలో పటిష్ట భద్రత ఏర్పాటు చేసి నామినేషన్ ప్రక్రియ సజావుగా జరిగే విధంగా ఏర్పాట్లు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా నామినేషన్లు వేయించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో మహబూబ్ దౌల, అధికారులు పవన్ కూమార్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఆర్బీసీ, గోరుకల్లు జలాశయ సాధనలో బొజ్జా వెంకటరెడ్డి కృషి మరువలేనిది.

**☛రైతాంగ సంక్షేమం, సాగునీటి సాధన, సామాజిక సామరస్యానికి బొజ్జా వెంకట రెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయం.**

**☛'నంద్యాల పెద్దాయన' 24వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు.**

పల్లె వెలుగు నంద్యాల రూరల్. రైతుల పక్షపాతిగా, ప్రజానాయకుడిగా, 'నంద్యాల పెద్దాయన'గా ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న కీర్తిశేషులు బొజ్జా వెంకట రెడ్డి గారి 24వ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం నంద్యాలలోని ఆయన స్వగృహంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పురప్రముఖులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, అభిమానులు పాల్గొని వ్యవసాయ అభివృద్ధి, సాగునీటి సాధన, విద్య, ప్రాంతీయ ప్రగతి, సామాజిక సామరస్యానికి ఆయన చేసిన విశేష సేవలను స్మరించుకున్నారు.

శ్రీశైలం కుడి బ్రాంచ్ కెనాల్ (ఎస్ఆర్బీసీ), గోరుకల్లు జలాశయం అభివృద్ధికి ఆయన చేసిన కృషిని, వ్యవసాయ పరిశోధన, విత్తనాభివృద్ధికి అందించిన సహకారాన్ని, నంద్యాలలో శాంతి సామరస్యాలను పెంపొందించడంలో పోషించిన పాత్రను వక్తలు ప్రత్యేకంగా ప్రస్తావించారు. నిరాడంబరత, ఆప్యాయత, ప్రజలతో మమేకమయ్యే స్వభావం కలిగిన నాయకుడిగా ఆయనను కొనియాడారు. ప్రజాసేవ, రైతాంగ సంక్షేమం పట్ల ఆయన చూపిన నిబద్ధత నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

రైతాంగ అభ్యున్నతికి విశేష కృషి.

నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్ఏఆర్ఎస్) అభివృద్ధికి, నంద్యాలలో విత్తనాభివృద్ధికి, జాతీయ విత్తన సంస్థ కార్యకలాపాల ఏర్పాటుకు బొజ్జా వెంకట రెడ్డి గారు విశేషంగా కృషి చేశారని వక్తలు గుర్తుచేశారు. నంద్యాలలో జాతీయ విత్తన సంస్థ యూనిట్ ఏర్పాటు చేయడంతోపాటు, కర్నూలు, బళ్లారి ప్రాంతాల్లో దాని కార్యకలాపాలను బలోపేతం చేయడంలో ఆయన పాత్రను ప్రస్తావించారు. జాతీయ విత్తన సంస్థ చైర్మన్‌గా పనిచేసిన ఆయన దేశవ్యాప్తంగా వ్యవసాయ, విత్తన రంగాల అభివృద్ధికి దోహదపడ్డారని కొనియాడారు.

వ్యవసాయ కళాశాలను నంద్యాల ప్రాంతానికి తీసుకురావడంలో ఆయన చేసిన కృషిని, పరిశోధన స్థానం కార్యకలాపాలకు ఆటంకం కలగకుండా కళాశాలను మహానందిలో ఏర్పాటు చేయించడంలో చూపిన చొరవను వక్తలు గుర్తుచేశారు. వ్యవసాయ పరిశోధన, విత్తనోత్పత్తి అభివృద్ధికి ఆయన చేసిన కృషి ప్రాంతీయ వ్యవసాయ రంగానికి బలమైన పునాదులు వేసిందని, రైతుల జీవనోపాధికి తోడ్పడిందని పేర్కొన్నారు.

సాగునీటి సాధనలో చెరగని ముద్ర.

ఎస్ఆర్బీసీ ప్రాజెక్టు, గోరుకల్లు జలాశయం సాధనలో బొజ్జా వెంకట రెడ్డి గారు చేసిన కృషి మరువలేనిదని వక్తలు తెలిపారు. రాయలసీమ రైతాంగ అభివృద్ధికి సాగునీరు ఎంత కీలకమో గుర్తించి, నీటి వసతుల అభివృద్ధికి ఆయన నిరంతరం కృషి చేశారని పేర్కొన్నారు. వ్యవసాయ అభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం సాగునీటి ప్రాజెక్టుల సాధనకు ఆయన చూపిన నిబద్ధత నేటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు.

ప్రజాసేవ, ప్రజాస్వామ్య విలువలకు ఆదర్శం.

బొజ్జా వెంకట రెడ్డి శాసనసభ్యుడిగా, లోక్‌సభ సభ్యుడిగా ప్రజలకు సేవలందించి, ప్రజలతో మమేకమై పనిచేయడం ద్వారా వారి హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారని వక్తలు పేర్కొన్నారు.

నంద్యాల లోక్‌సభ నియోజకవర్గం నుంచి నీలం సంజీవరెడ్డి గారి ఎన్నికలో ఆయన పోషించిన కీలక పాత్రను గుర్తుచేశారు. అలాగే పీవీ నరసింహారావు గారిని నంద్యాల లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయించడంలో, ఆయన ఘన విజయం సాధించడంలో బొజ్జా వెంకట రెడ్డి రాజకీయ చతురత, ప్రజల్లో ఉన్న ఆదరణ ప్రతిబింబించాయని తెలిపారు.

వివిధ వర్గాల ప్రజలను కలుపుకొని ముందుకు సాగడం, ప్రజాభిప్రాయాలను గౌరవించడం, నైతిక విలువలకు కట్టుబడి ప్రజాసేవ చేయడం ఆయన రాజకీయ జీవితంలోని విశిష్ట లక్షణాలని పేర్కొన్నారు. నేటి రాజకీయ నాయకులు ఆయన నిరాడంబరత, సమగ్రత, ప్రజాసేవా దృక్పథాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

ఆర్ఏఆర్ఎస్ పరిరక్షణకు పిలుపు.

నంద్యాల ప్రాంత వ్యవసాయ పరిశోధన, అభివృద్ధికి కీలకమైన ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్ఏఆర్ఎస్)ను పరిరక్షించి, మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని వక్తలు స్పష్టం చేశారు.

వ్యవసాయ పరిశోధన సదుపాయాలు, రైతులకు ఉపయోగపడే ప్రజా ఆస్తులు దెబ్బతినేలా నిర్ణయాలు తీసుకోరాదని హెచ్చరించారు. ప్రాంత భవిష్యత్తు అభివృద్ధిని ప్రభావితం చేసే నిర్ణయాలు తీసుకునే ముందు రైతులు, వ్యవసాయ నిపుణులు, స్థానిక ప్రజలు, ప్రజా సంఘాలతో ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు సంప్రదింపులు జరపాలని కోరారు.

ఆర్ఏఆర్ఎస్‌ను పరిరక్షించడం ద్వారా వ్యవసాయ పరిశోధన, విత్తనాభివృద్ధి, రైతుల జీవనోపాధిని కాపాడుకోవచ్చని వారు పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యబద్ధమైన, సంప్రదింపులతో కూడిన పాలన అవసరం.

ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు ప్రజల ఆశలు, ఆకాంక్షలను గౌరవిస్తూ చర్చలు, సంప్రదింపుల ద్వారా నిర్ణయాలు తీసుకోవాలని వక్తలు కోరారు.

ప్రభుత్వ విధానాల్లోని లోపాలను ప్రజలు, ప్రజా సంఘాలు ఎత్తిచూపినప్పుడు వాటిని నిర్మాణాత్మక విమర్శలుగా స్వీకరించాలే తప్ప, వ్యతిరేకతగా భావించరాదని సూచించారు.

విమర్శకులకు అన్యాయంగా ముద్రలు వేయడం, భిన్నాభిప్రాయాలను అణచివేయడం ప్రజాస్వామ్య



విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా ప్రజల మధ్య ఐక్యతను పెంపొందిస్తూ, విభజన రాజకీయాలకు దూరంగా ఉండాలని రాజకీయ పార్టీలకు పిలుపునిచ్చారు.

బొజ్జా వెంకట రెడ్డి గారి ఆశయాలను కొనసాగిస్తూ నంద్యాల ప్రాంత అభివృద్ధి, రైతాంగ సంక్షేమం, ఆర్ఏఆర్ఎస్ పరిరక్షణ, సాగునీటి సాధన, సామాజిక సామరస్యం కోసం కృషి చేస్తామని వక్తలు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమం

బొజ్జా వెంకట రెడ్డి అగ్రికల్చరల్ ఫౌండేషన్ చైర్మన్ బొజ్జా దశరథ రామిరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యవసాయ పారిశ్రామికవేత్త ఆత్మకూరు రవీంద్రనాథ్, రామకృష్ణ విద్యాసంస్థల అధిపతి రామకృష్ణారెడ్డి, అడ్వకేట్ శంకరయ్య, సౌదాగర్ ఖాసిం మియా, వ్యాపారవేత్త పరమేశ్వర రాజశేఖర్, మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు షణ్ముఖ్, వ్యవసాయ వ్యాపారవేత్తలు గెలివి భాను, నిచ్చనిమెట్ల సుబ్బరామయ్య, చిత్తలూరు రామచంద్రయ్య, మహమ్మద్ పర్వేజ్, కాంగ్రెస్ నాయకులు చింతలయ్య, మస్తాన్ పాల్గొన్నారు.

బొజ్జా వెంకట రెడ్డి అగ్రికల్చరల్ ఫౌండేషన్ ప్రతినిధులు యర్రం శంకర్ రెడ్డి, ఏర్వ రామచంద్ర రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, నిట్టూరి సుధాకర్ రావుతో పాటు రాయలసీమ సాగునీటి సాధన సమితి కార్యవర్గ సభ్యులు పట్నం రాముడు, రాము, మనోజ్, అసదుల్లా, మెహబూబ్ భాష పాల్గొన్నారు.

ఇతర ప్రముఖుల్లో ఎల్.కె.ఆర్. విద్యాసంస్థల అధిపతి లక్ష్మీకాంత రెడ్డి, డాక్టర్ రమణారెడ్డి, విశ్రాంత ఆంధ్ర బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ శివనాగిరెడ్డి, ప్రొఫెసర్ శివరామిరెడ్డి, బొజ్జా వెంకట రెడ్డి కుటుంబ సభ్యులు శివగోపాల్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, హరినాథ్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, మాస్టర్ యువన్ రెడ్డి, ప్రముఖ వ్యాపారవేత్త కల్లూరి రామలింగారెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పాల్గొన్న వారంతా బొజ్జా వెంకట రెడ్డి గారికి ఘనంగా నివాళులర్పిస్తూ, ప్రజాసేవ, వ్యవసాయాభివృద్ధి, సాగునీటి సాధన, నంద్యాల ప్రాంత అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.

# మృతుని కుటుంబానికి అండగా ఉంటా

## దహన సంస్కారాలకు రూ.20 వేలు సాయం





మహానంది, పల్లె వెలుగు మహానంది మండలం మసీదుపురం గ్రామం మాదిగ పేటకు చెందిన టీడీపీ కార్యకర్త నులక చందనం బాల నరసింహుడు అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం ఈ విషయం తెలుసుకున్న మహానంది దేవస్థానం చైర్మన్ నరాల చంద్రమౌళీశ్వర రెడ్డి మృతదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబాన్ని పరామర్శించి దహన సంస్కారాలకు రూ. 20వేలు ఆర్థిక సాయం అందజేశారు. చైర్మన్ మాట్లాడుతూ.. నరసింహుడు మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. తెలుగుదేశం పార్టీకి కోసం అహర్నిశలు కష్టపడ్డ వ్యక్తి మన నుంచి దూరం కావడం చాలా బాధాకరం అన్నారు. వారి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని, వారి పిల్లల చదువులకు నా సహకారాలు ఉంటాయన్నారు

# బనగానపల్లెలో నామినేషన్ల సందడి

బనగానపల్లె, అక్టోబర్ 23,పల్లెవెలుగు బనగానపల్లె మండల పరిధిలో ఎంపీటీసీ స్థానాలకు



నామినేషన్ ప్రక్రియ సందర్భంగా తొలి రెండు రోజులు ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదు. శుక్రవారం ఒక్కసారిగా సందడి మొదలైంది. నామినేషన్లు వేసేందుకు ఇరుపార్టీల నాయకులు మండల పరిషత్ కార్యాలయానికి భారీగా చేరుకున్నారు. పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టి లోపలికి అనుమతించారు. ఎవరికైనా ఇద్దరిని మించి ఎక్కువ మందికి అనుమతి లేదని తేల్చిచెబుతూ ఇతరులను బయటే వెనక్కి పంపించారు.అందులో భాగంగా బనగానపల్లె నియోజకవర్గం లో 5 మండలాల్లో ఎంపీటీసీ స్థానాలు మొత్తం 85 కు 180 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు.బనగానపల్లె మండలం లో 29 ఎంపీటీసీ స్థానాలకు గాను టిడిపి 28 వైఎస్ఆర్సిపి 29 జనసేన 2 బనగానపల్లె మండలం మొత్తం 59 నామినేషన్లు అభ్యర్థులు దాఖలు చేశారు.కోవెలకుంట్ల మండలంలో మొత్తం14 ఎంపీటీసీ స్థానాలు టిడిపి 14,వైఎస్ఆర్సిపి 14 జనసేన 1,బిజెపి 1.సంజామల మండలంలో ఎంపీటీసీ స్థానాలు 11 టిడిపి 13 వైఎస్ఆర్సిపి 8 ఇండిపెండెంట్ 3.కొలిమిగుండ్ల మొత్తం ఎంపీటీసీ స్థానాలు15 టిడిపి 23 వైఎస్ఆర్సిపి 11 అవుకు మొత్తం ఎంపీటీసీ స్థానాలు 16 టిడిపి 15 వైఎస్ఆర్సిపి 16 ఇండిపెండెంట్ 2.మొత్తం బనగానపల్లె నియోజకవర్గం లో 108 నామినేషన్ లు దాఖలు చేసిన అభ్యర్థులు.

# పాణ్యంలో ఎంపీటీసీ నామినేషన్ల జోరు

## మూడో రోజు 28 దాఖలు.. ఇప్పటివరకు 89 నామినేషన్లు

పాణ్యం అక్టోబర్ 23 పల్లె వెలుగు: మండలంలో ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియ జోరుగా కొనసాగుతోంది. మూడో రోజు టీడీపీ నుంచి 13, వైఎస్సార్సీపీ నుంచి 8, జనసేన నుంచి 2, బీజేపీ నుంచి 3, స్వతంత్ర అభ్యర్థుల నుంచి 2 చొప్పున మొత్తం 28 నామినేషన్లు దాఖలయ్యాయి. దీంతో మూడు రోజుల్లో మొత్తం నామినేషన్ల సంఖ్య 89కు చేరినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కమలాకర్ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో మండలంలో రాజకీయ సందడి నెలకొనగా, అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.



# నంద్యాలలో అభివృద్ధి శూన్యం.. అక్రమాలు, భూకబ్జాలే ఫుల్!.. శిల్పా

## ఇది మంచి ప్రభుత్వం కాదు.. ప్రజలను ముంచే ప్రభుత్వం!మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి..





పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. పట్టణంలోని నూనెపల్లె, సాయిబాబా నగర్ లో మాజీ ఎమ్మెల్యే శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి ఎమ్మెల్సీ ఇషాక్ భాషా, ఎన్నికల ప్రచారం నిర్వహించారు

రాష్ట్రంలో తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలపై అధిక ధరల భారం మోపి వారి నడ్డి విరిచిందని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి విమర్శించారు. నంద్యాలలో మంత్రి పాలనలో అభివృద్ధి శూన్యమని, అక్రమాలు, నంద్యాల భూకబ్జాలు రౌడీయిజం పెరిగాయని ఆయన ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని, పెరిగిన ధరలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పాలకులు విఫలమయ్యారని పేర్కొన్నారు. నంద్యాల మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వైసీపీ చైర్మన్ అభ్యర్థి దాల్మిల్ అమీర్‌తో పాటు 26వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి సునీత అమృత రాజ్, 27వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి ఉషేనమ్మ, 36వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి మభూమ్నిసా, 37వ వార్డు షేక్ శివనాజ్ లను గెలిపించాలని వైసీపీ నాయకులు ప్రజలను కోరారు. ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి వైసీపీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వారు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రజల మద్దతుతో వైసీపీ అభ్యర్థులను గెలిపించి, ప్రజా సమస్యల పరిష్కారానికి అవకాశం కల్పించాలని కోరారు.

## వైస్సార్సీపీ ఎంపీటీసీ అభ్యర్థి గా శేఖర్ గౌడ్ నామినేషన్



బనగానపల్లె, అక్టోబర్ 23,పల్లెవెలుగు బనగానపల్లె మండలం లోని నందవరం గ్రామం ఎంపీటీసీ 1 కు బీసీ యువ నాయకుడు ఈడిగ చంద్రశేఖర్ గౌడ్ వైయస్సార్సీపీ అభ్యర్థి గా నామినేషన్ ఫారం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేశారు ఆయన వెంట వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకున్నట్లు ఫిర్యాదులు వస్తే తక్షణ చర్యలు

నామినేషన్ల దాఖలుకు సహకరించాలని అధికారులకు ఆదేశాలు
జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి




పల్లె వెలుగు కర్నూలు బ్యూరో నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకున్నట్లు ఫిర్యాదులు అందినట్లయితే తక్షణ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సంబంధిత అధికారులను ఆదేశించినట్లు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఒక ప్రకటనలో తెలిపారు. నామినేషన్లు దాఖలు చేయకుండా తమను ఎవరైనా అడ్డుకున్నారని ఫిర్యాదులు అందిన సందర్భాల్లో, సంబంధిత ఫిర్యాదుదారులను ఫోన్ ద్వారా వెంటనే సంప్రదించి, నిర్ణీత గడువు అయిన అక్టోబర్ 23వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు నామినేషన్లు దాఖలు చేసేందుకు అవసరమైన సహకారం అందించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అటువంటి అభ్యర్థులు సమర్పించే నామినేషన్లను నిర్దేశిత విధానానికి అనుగుణంగా స్వీకరించేలా సంబంధిత రిటర్నింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. అవసరమైన చోట సంబంధిత అభ్యర్థులకు వ్యక్తిగత భద్రత కల్పించి, నామినేషన్ల స్వీకరణ కేంద్రాలకు సురక్షితంగా చేరుకునేలా పోలీసు శాఖ తగిన చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ తెలిపారు.నిర్ణీత గడువులోగా అభ్యర్థులు ప్రశాంత వాతావరణంలో నామినేషన్లు దాఖలు చేసేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

## మైనారిటీల హక్కుల రక్షణకై వైస్సార్సీపీకి మద్దతుగా నిలుద్దాం సుహైల్ రానా.



పల్లె వెలుగు నంద్యాల రూరల్. ??నంద్యాల పట్టణంలోని స్థానిక 44వ వార్డు వైస్సార్సీపీ కౌన్సిలర్ అభ్యర్థి,యువ న్యాయవాది సుహైల్ రానా మాజీ కౌన్సిలర్ తమీమ్ అన్సారీ శుక్రవారం నమాజ్ అనంతరం వార్డులోని ముస్లిం సోదరులు,పెద్దలను కలుస్తూ మున్సిపల్ ఎన్నికల్లో వైస్సార్సీపీ కి మద్దతు ఇవ్వాలని కోరారు.

ఈ సందర్భంగా సుహైల్ రానా మాట్లాడుతూ మసీదు బయట ముస్లిం సోదరులతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ మైనారిటీల సంక్షేమం,హక్కుల పరిరక్షణకై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఒక న్యాయవాదిగా వార్డు ప్రజల సమస్యలను చట్టపరంగా,పరిపాలనాపరంగా సమర్థవంతంగా పరిష్కరిస్తానని ప్రతి ముస్లిం సోదరుడికి హామీ ఇస్తున్నామన్నారు . కావున 44వ వార్డు ప్రజలందరూ నవంబర్ 1వ తేదీ జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో తనను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ నాయకులు రాఘవ, ఎస్.కే బాషా, అర్షద్, షాహిన్షా, రఫీ, ఇర్ఫాన్, సాదిక్, అరిఫ్, జుబేర్, రెహేమాన్, శ్రీను ఎస్డీపిఐ నాయకులు సోహైల్ తదితరులు పాల్గొన్నారు.

## నంద్యాల మండలం పులిమద్ది గ్రామంలో టీడీపీకి షాక్.

### మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి సమక్షంలో వైసీపీలో చేరికలు.

పల్లె వెలుగు నంద్యాల రూరల్. నంద్యాల మండలం పులిమద్ది గ్రామంలో తెలుగుదేశం పార్టీకి షాక్ తగిలింది. మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి సమక్షంలో బొజ్జ ఎల్లారెడ్డి, ఆళ్లగడ్డ రవీంద్రనాథ్ రెడ్డి, ధనుంజయ రెడ్డి, మంగలి రవీంద్రబాబు, బోయ సురేంద్ర, పబ్బతి రాజన్న తదితరులు తమ కుటుంబ సభ్యులు, మిత్రులతో కలిసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి వారందరినీ వైసీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా శిల్పా మోహన్ రెడ్డి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు కావస్తున్నా గ్రామాల్లో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని విమర్శించారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడాన్ని పక్కనపెట్టి, టీడీపీ నాయకులు దోచుకోవడం, దాచుకోవడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నంద్యాలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల మద్దతుతో వైసీపీ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. పులిమద్ది గ్రామంలో జరిగిన ఈ చేరికలతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.



## ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు... కలెక్టర్ రాజకుమారి గణియా.

**రుద్రవరంలో నామినేషన్ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ, డిప్యూటీ కలెక్టర్.**

రుద్రవరం. పల్లె వెలుగు : ఎంపిటిసి ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా తెలిపారు. మండల కేంద్రమైన రుద్రవరంలోని ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియలో భాగంగా 2వరోజు (గురువారం) సాయంత్రం టిడిపి వైసిపి వర్గాల మధ్య ఉద్రిక్తతలు చోటు చేసుకోవడంతో ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని శుక్రవారం నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా సందర్శించారు. నామినేషన్ కేంద్రం పరిసరాలను పరిశీలించి నామినేషన్ ప్రక్రియ జరుగుతున్న తీరును అధికారులతో ఆరాతీశారు. బందోబస్తు తదితర అంశాలపై పోలీసులను అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ కేంద్రానికి పోటీ చేసే అభ్యర్థులు వచ్చే సందర్భంలో ఎటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని పోలీసులకు సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని నామినేషన్ కేంద్రానికి సమీపంలో ప్రజలు ఎవరైనా గుంపులుగా ఉన్నా, ఎన్నికల నిబంధనలను అతిక్రమించినా కేసులు నమోదు చేయాలని పోలీసులను సూచించారు.



నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షరాన్ నామినేషన్ కేంద్రాన్ని సందర్శించి నామినేషన్ ప్రక్రియ బందోబస్తు నిర్వహణ తదితర అంశాలపై పోలీసులను అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ వేసేందుకు వచ్చే ఇరువర్గాలవారు ఎటువంటి సంఘటనలకు పాల్పడకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసులకు సూచించారు. నంద్యాల డిప్యూటీ కలెక్టర్ మనీషా నామినేషన్ కేంద్రాన్ని సందర్శించి నామినేషన్ జరుగుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ కేంద్రాన్ని సందర్శించిన పలువురు అధికారులు నామినేషన్ జరుగుతున్న ప్రక్రియ తీరును పరిశీలించి ఎన్నికల అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రుద్రవరం మండలంలో మొత్తం 14 ఎంపీటీసీ స్థానాలకు గాను 59 నామినేషన్ దాఖలయ్యాయి. చివరి రోజు నామినేషన్ల పర్వం ప్రశాంతంగా ముగియడంతో అటు ఎన్నికల అధికారులు ఇటు పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు.

## ఉత్తమ అభ్యుదయ రైతుగా సింగతల మధుసూదన్ రెడ్డి.

రుద్రవరం. పల్లె వెలుగు : ఉత్తమ అభ్యుదయ రైతుగా సింగతల మధుసూదన్



రెడ్డి ఎంపికైనట్లు వ్యవసాయ అధికారి జి సుమతి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం నంద్యాల లో కిసాన్ మేళా కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం అసోసియేట్ డైరెక్టర్ జయలక్ష్మి జిల్లా వనరుల కేంద్రం ఏ డి ఏ చెన్నయ్య చేతుల మీదుగా రుద్రవరం మండలం కొండమయిపల్లె గ్రామ అభ్యుదయ రైతు అయినా సింగతల మధుసూదన్ రెడ్డి కి ఉత్తమ రైతుగా ఎంపికైనందున జిల్లా జాయింట్ కలెక్టర్ ఉత్తమ రైతుగా ప్రకటించి సన్మానించడం జరిగినది.రుద్రవరం మండలంలో కొండమయిపల్లి గ్రామానికి చెందిన సింగతల.మధుసూదన్ రెడ్డి అనే రైతు గత సంవత్సరం నుంచి రాష్ట్రంలో ఉన్న వ్యవసాయ పరిశోధన స్థానాలలో విడుదలైన మేలైన వరి రకాలను సాగు చేస్తూ మంచి దిగుబడులు సాధించడం జరిగిందని తెలిపారు .వ్యవసాయ అధికారుల సూచనలు సలహాలు పాటిస్తూ తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం తో పాటు మండలంలోని మిగతా రైతులకు కూడా తన పొలంలో సాగుచేసిన నూతన వరి విత్తనాలను మిగతా రైతులకు అందించడం జరుగుతుందని తెలిపారు .ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారులు రాజు, ఫహిమ తబస్సుమ్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు మరియు వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## ఆళ్లగడ్డలో ఎంపిటిసి, జడ్పిటిసి నామినేషన్ల స్వీకరణ ప్రశాంతం

ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 23, పల్లె వెలుగు ఆళ్లగడ్డ పట్టణం లో ఎంపిటిసి,



జెడ్పిటిసి నామినేషన్ల స్వీకారణ ఈ నెల 21 వ తేదీ నుండి 23 వ తేది వరకు ప్రశాంతంగా ముగిసింది. శుక్రవారం నాడు ఆళ్లగడ్డలో ఎంపిటిసి నామినేషన్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా, జిల్లా ఎస్పీ సునీల్ షరాన్, సబ్ కలెక్టర్ మనిషా లు పర్యవేక్షించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నియమావాలి ప్రకారం గత మూడు రోజుల పాటు ఎంపిటిసి అభ్యర్థుల నుండి నామినేషన్లు స్వీకరించామని ఆళ్లగడ్డ ఎన్నికల అధికారి హరి గోపాల్ తెలిపారు. మొదటి రోజు రెండు నామినేషన్లు, రెండవ రోజు 30 నామినేషన్లు, చివరి రోజు శుక్రవారం 30 నామినేషన్లు, మొత్తం 62 నామినేషన్లు వచ్చాయన్నారు. ఇందులో టిడిపి 27, వైసీపీ 23, జనసేన 9, ఎస్డిపిఐ 2, కాంగ్రెస్ 1 నామినేషన్లు దాఖలయ్యాయని తెలిపారు. 24 వ తేదీ శనివారం ఉదయం 8 గంటల నుండి స్క్రూటినీ జరుగుతుందన్నారు. అలాగే 27 వ తేది మంగళ వారం నామినేషన్ల ఉపసంహారణ కార్యక్రమం జరుతుందని, అనంతరం ఎంపిటిసి అభ్యర్థుల తుది జాబితా విలువదుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ నూర్జహాన్, ఎమ్మార్వో జ్యోతి రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

## మహానందిలో వసతి గదుల నిర్మాణానికి విరాళం

మహానంది, పల్లె వెలుగు మహానంది పుణ్యక్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం



నూతనంగా నిర్మిస్తున్న నందీశ్వర సదనం విశ్రాంతి భవనంలో ఒక సూట్ గది నిర్మాణానికి భక్తులు విరాళం అందజేసినట్లు ఈవో ఎన్. శ్రీనివాస రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ. గిద్దలూరుకు చెందిన కమతం శ్రీనివాసులు, జ్యోతి దంపతులు రూ.15 లక్షలు ఇవ్వడానికి ముందుకు వచ్చారన్నారు. మొదటి విడతగా రూ.2 లక్షల చెక్కును అందజేశారన్నారు.దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించి, స్వామివార్ల దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## చాగలమర్రి మండలం

### 15 ఎంపీటీసీ స్థానాలకు 71 నామినేషన్లు దాఖలు

చాగలమర్రి అక్టోబర్ 23 పల్లె వెలుగు మండల పరిషత్ ప్రాదేశిక



నియోజకవర్గ ( ఎంపీటీసీల ) స్థానాలకు గాను చివరి రోజు శుక్రవారం నాటికి 48 నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి సునీల్ ఖన్నా తెలిపారు. తెలుగుదేశం పార్టీ 11, వైయస్సార్ పార్టీ 29, జనసేన పార్టీ 7, కాంగ్రెస్ పార్టీ 1, మొత్తం చివరి రోజు నాటికి 71 నామినేషన్లు దాఖలయ్యాయి. 15 ఎంపీటీసీ స్థానాలకు గాను మొత్తం 71 మంది అభ్యర్థులు నామినేషన్ వేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది.

## గడివేములలో12 ఎంపీటీసీ స్థానాలకు 54 నామినేషన్లు



పల్లెవెలుగు పల్లె వెలుగు దినపత్రిక మండలంలో12 ఎంపీటీసీ స్థానాలకు మూడవరోజు 54 నామినేషన్ లో దాఖలు అయినట్లు రిటర్నింగ్ అధికారి విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో 12ఎంపీటీసీ స్థానాలకు టిడిపి అభ్యర్థులు 29 మంది, వైసీపీ పార్టీ అభ్యర్థులు 23 మంది, ఒకరు జనసేన పార్టీ నుండి, బిజెపి నుండి ఒకరు నామినేషన్ వేసినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి తెలిపారు. శుక్రవారం ఒక్కరోజే 14 నామినేషన్లు అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు. కార్యక్రమంలో తహసిల్దార్ వెంకటరమణ, ఎంపీడీవో వాసుదేవ గుప్తా పాల్గొన్నారు

## జెడ్పిటిసి అభ్యర్థిగా కోట్ల భానుశ్రీ నామినేషన్

పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : కోడుమూరు వైసీపీ జెడ్పిటిసి అభ్యర్థిగా కోట్ల భానుశ్రీ శుక్రవారం నామినేషన్ వేశారు. దేవనకొండ మాజీ జెడ్పిటిసి,



ప్రస్తుత వైసిపి సీఈసీ మెంబర్ కోట్ల హరిచక్రపాణి రెడ్డి సతీమణి అయిన భానుశ్రీ 14 సంవత్సరాలు లద్దగిరి సొసైటీ ప్రెసిడెంట్ గా పని చేశారు. ప్రస్తుతం కోడుమూరు జడ్పీటీసీ స్థానం జనరల్ మహిళకు కేటాయించడంతో వైసీపీ తరఫున భానుశ్రీ బరిలో నిలిచారు. ఎవరూ ఊహించని విధంగా భానుశ్రీని పోటీలో నిలబడడం, పైగా కోట్ల కుటుంబం నుంచి వచ్చిన మహిళ కావడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న కోట్ల కుటుంబం నుంచి వచ్చిన మహిళ కావడంతో కోడుమూరులో ఇప్పుడు ఇదే హాట్ టాపిక్ గా మారింది. కోట్ల హరిచక్రపాణి రెడ్డికి ప్రజల్లో ఉన్న మంచి పేరు, ఆదరణ ఆమె గెలుపునకు ఎంతో ఉపకరిస్తాయని విశ్లేషకులు భావిస్తున్నారు. కోట్ల కుటుంబం కూడా ఈమె గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్టు తెలుస్తోంది.

# రబీ సీజన్‌లో ఎల్‌నినో, వర్షాభావ పరిస్థితులను అధిగమించేందుకు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి.

- **పంట ఉత్పత్తులకు విలువ జోడింపు ద్వారా రైతులకు అదనపు ఆదాయం.**
- **జిల్లా స్థాయి కిసాన్ మేళా-2026లో 21 మంది ఉత్తమ రైతులకు సన్మానం.**
- **జాయింట్ కలెక్టర్ జి. సూరజ్ ధనుంజయ్.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ప్రస్తుత రబీ సీజన్‌లో ఎల్‌నినో ప్రభావం, వాతావరణ మార్పులు, వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను విస్తృతంగా అనుసరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ జి. సూరజ్ ధనుంజయ్ సూచించారు. పండించిన పంటలకు ఆహార శుద్ధి, ప్రాసెసింగ్ ద్వారా విలువ జోడించి, మార్కెట్‌లో మెరుగైన ధరలు పొందడంతోపాటు అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ, ఆత్మ (ఏటీఎం ఏ) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి కిసాన్ మేళా-2026, రైతు శిక్షణ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ ఆధారిత ప్రకృతి వ్యవసాయం ( ఏపీ సీఎం ఎఫ్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాల్‌ను ప్రారంభించి, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు, చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, వివిధ రకాల కషాయాలు, అడవి తేనె, నన్నారి తదితర అటవీ ఆధారిత ఉత్పత్తులను పరిశీలించారు. పీఎండీఎస్, కిచెన్ గార్డెన్ కిట్లు, ఎఫ్ఎస్ఎస్ఏఐ ధ్రువీకరణ పొందిన విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, విక్రయాల వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, రసాయన రహిత సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని, విత్తన శుద్ధిని తప్పనిసరిగా చేపట్టాలని సూచించారు. పంటలకు చీడపీడలు ఆశించినప్పుడు రసాయన మందుల వినియోగాన్ని తగ్గించి, జీవామృతం, వేప, పచ్చిమిర్చి, అల్లం వంటి సహజ పదార్థాలతో తయారు చేసిన కషాయాలను శాస్త్రీయ పద్ధతుల్లో వినియోగించాలని తెలిపారు. నేల ఆరోగ్యాన్ని కాపాడుతూ, సాగు ఖర్చులను తగ్గించుకునేలా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అలవర్చుకోవాలని కోరారు. రైతులు పండించిన ఉత్పత్తులను ముడి సరుకులుగా విక్రయించడంతోనే పరిమితం కాకుండా, ఆహార శుద్ధి, ప్రాసెసింగ్ ద్వారా విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చుకోవాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. ఇందుకోసం అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలు, శిక్షణా కార్యక్రమాలు, ప్రాసెసింగ్ యూనిట్లను సద్వినియోగం చేసుకొని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని పేర్కొన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంలో ప్రతిభ కనబరుస్తూ, అధిక దిగుబడులు సాధిస్తున్న 21 మంది ఉత్తమ రైతులను శాలువాలతో సత్కరించి, ప్రశంసాపత్రాలను అందజేశారు.

రైతుల ఆదాయం పెంపే కిసాన్ మేళా లక్ష్యం జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నూతన పద్ధతులను రైతులకు పరిచయం చేసి, వారి ఆదాయాన్ని పెంపొందించడమే కిసాన్ మేళా ప్రధాన ఉద్దేశమని తెలిపారు. నేల సారాన్ని కాపాడేందుకు పంట మార్పిడి విధానాలను అనుసరించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన వివిధ ఉత్ప్రేరకాలను బయో రిసోర్స్ సెంటర్ల (బి ఆర్ సి) ద్వారా రైతులకు అందుబాటులో ఉంచుతున్నట్లు వెల్లడించారు.

ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం , నంద్యాల అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ వి. జయలక్ష్మి మాట్లాడుతూ, పరిశోధనా స్థానం ద్వారా విడుదలైన నూతన జొన్న, శనగ విత్తన రకాలను సాగు చేయడం ద్వారా రైతులు మెరుగైన దిగుబడులు సాధించవచ్చని వివరించారు.

ఉద్యాన శాఖ అధికారి బి. హరేంద్ర మాట్లాడుతూ, పాలీహౌస్‌లు, షేడ్‌నెట్‌ల ఏర్పాటుకు 50 శాతం రాయితీతో పాటు, గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ద్వారా అమలవుతున్న వివిధ ఉద్యాన పథకాల ప్రయోజనాలను రైతులు పొందవచ్చని తెలిపారు. ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ పథకం ద్వారా ఆహార శుద్ధి, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ యూనిట్ల ఏర్పాటుకు 35 శాతం రాయితీ అందిస్తున్నట్లు సంబంధిత అధికారి రవికిరణ్ వివరించారు.

మహిళా రైతుల విజయగాథలు.. రైతులకు




స్ఫూర్తి

కృషి విజ్ఞాన కేంద్రం (కె వి కె), యాగంటిపల్లి ద్వారా శిక్షణ పొందిన మహిళా పారిశ్రామికవేత్తలు ఎస్. మానస, యశోద, మహేశ్వరమ్మ తమ వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడించి, స్వయం ఉపాధి ద్వారా ఆదాయం పెంచుకున్న విజయగాథలను కార్యక్రమంలో వివరించారు. వారి అనుభవాలు ఇతర రైతులకు స్ఫూర్తినిచ్చేలా నిలిచాయి. కిసాన్ మేళాలో భాగంగా వివిధ కంపెనీలు నూతన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ పరికరాలతో స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఎలక్ట్రిక్ ట్రాక్టర్లు, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు, ఇతర ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రదర్శించగా, రైతులు ఆసక్తిగా తిలకించి వివరాలను తెలుసుకున్నారు. రైతులు ఎదుర్కొంటున్న సాగు సమస్యలపై శాస్త్రవేత్తలతో ముఖాముఖి నిర్వహించి, పంటల సాగు, చీడపీడల నివారణ, దిగుబడుల పెంపు తదితర అంశాలపై సలహాలు, సూచనలు పొందారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు కె.వి. రమణయ్య, అశోక్, లక్ష్మీప్రియ, నీలిమ, డిప్యూటీ డైరెక్టర్లు ఆర్. గంగాధర్ రావు, చెన్నయ్య, టెక్నికల్ ఆఫీసర్ కళ్యాణ్ కుమార్, వ్యవసాయ, ఉద్యానవన, డీఆర్‌డీఏ శాఖల అధికారులు, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, రైతు ఉత్పత్తిదారులు, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 500 మంది రైతులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముసిన ఎంపీటీసీ లనామినేషన్ల పర్వం

- **దొర్నిపాడు నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన**
- **జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియ, ఎస్పీ సునీల్ షెరాన్**







దొర్నిపాడు అక్టోబర్ 23 పల్లె వెలుగు న్యూస్ స్థానిక ఎన్నికల ప్రక్రియలో భాగంగఎంపీటీసీల నామినేషన్ల తొలి ఘట్టం ప్రశాంతంగా ముగిసింది మండల కేంద్రమైన దొర్నిపాడుఎంపీడీవోకార్యాలయంలో చివరి రోజు జరిగిన ఎంపిటిసి నామినేషన్ పర్వాన్ని పరిశీలించడానికి జిల్లా కలెక్టర్ రాజకుమార్ గనియా జిల్లా ఎస్పీ సునీల్ షరాన్, డిఎస్పిరవికుమార్పరిశీలించారు దొర్నిపాడు మండలంలో 7 ఎంపీటీసీ స్థానాలకు గాను 33 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు, ఇందులో జనసేన,4 ఇండిపెండెంట్, 7,వైసిపి 7, టిడిపి15 నామినేషన్లుచివరి రోజున వేశారు, మాజీ మండల అధ్యక్షుడుభూమాబ్రహ్మానందరెడ్డిఆధ్వర్యంలో 4 ఎంపీటీసీ స్థానాలకు ఇండిపెండెంట్ అభ్యర్థులనునామినేషన్ వేయించారు సిఐ,బివి రమణ మాట్లాడుతూ నామినేషన్ వేసే అభ్యర్థులకు రక్షణ కల్పించడం ప్రతిష్టమైన భద్రతను ఏర్పాటు చేయడం, నామినేషన్ వేయడానికి వచ్చి అభ్యర్థులు ఎవరైనా ఇబ్బందులు గురైతే వారికి రక్షణ కల్పించడం పోలీసులబాధ్యతని ఆయన అన్నారు,అల్లర్లు సృష్టించే వారిపై కఠినమైన చర్యలు ఉంటాయని ఆయనఅన్నారు,శాంతిభద్రతలపరి రక్షణేపోలీసులధ్యేయం అన్నారు నామినేషన్ కేంద్రాలను కలెక్టర్ ఎస్పీ ,అడిషనల్ ఎస్పీ, పరిశీలించి అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు ల ే క ్ ు ం డ చర్యలుచేపట్టాలనిసూచించినట్లుఆయనతెలిపారు, దొర్నిపాడు ఎస్ఐ వరప్రసాద్ పోలీస్ సిబ్బందిపోలింగ్ కేంద్రం వద్ద ఉన్నారు

## పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలి...



చాగలమర్రి అక్టోబర్ 23 పల్లె వెలుగు మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ ఎన్నికలకు వివిధ రాజకీయ పార్టీ నాయకులు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని నంద్యాల జిల్లా అడిషనల్ ఎస్పీ ఖాదర్ భాష అన్నారు. శుక్రవారం చాగలమర్రి ఎంపీడీవో కార్యాలయ నామినేషన్ కార్యాలయాల వద్ద ఏర్పాటుచేసిన నామినేషన్ ప్రక్రియ పరిశీలించారు. పోలీస్ పందోబస్తుతో పకడ్బందీగా నామినేషన్లు వేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన, ఎన్నికల నియమ నిబంధనలను పాటించాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నంతవరకు ఎటువంటి ఘర్షణలకు పాల్పడిన, దౌర్జన్యం చేసిన, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.ఈ కార్యక్రమం లో రూరల్ సీఐ బీవీ రమణ, ఎస్సై నాగేంద్ర ప్రసాద్, పోలీస్ బందోబస్తులు ఉన్నారు.

## ఎంపీటీసీ స్థానాలకు 59 నామినేషన్లు.



రుద్రవరం. పల్లె వెలుగు: రుద్రవరం మండలం లో ఉన్న 14 ఎంపీటీసీ స్థానాలకు 59 నామినేషన్లు స్వీకరించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి డాక్టర్ మనోరంజన్ ప్రతాప్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 21 నుంచి 23వ తేదీ వరకు 14 ఎంపీటీసీ స్థానాలకు పార్టీల వారీగా వైఎస్ఆర్ సిపి 25, టిడిపి 24, సిపిఐ 2 జనసేన 7 బిజెపి 1 నామినేషన్లు స్వీకరించినట్లు ఆయన తెలిపారు. నామినేషన్ల స్వీకరణ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సిరివెళ్ల సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సీఐ బిఆర్ క్రీష్ణయ్య, ఎస్సై మహమ్మద్ రఫీ, ఏఎస్ఐ లు బాలన్న, రాంభూపాల్ రెడ్డి పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

## జడ్పీటీసీగా నామినేషన్ వేసిన వంగాల శ్రీనివాస్ రెడ్డి..

పల్లె వెలుగు దినపత్రిక గడివేముల.. మండలంలోని మంచాలకట్ట గ్రామానికి చెందిన



టిడిపి సీనియర్ నాయకులు మాజీ మండల అధ్యక్షులు వంగాల శ్రీనివాస్ రెడ్డి, శుక్రవారం నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వెలుగోడు మండల జడ్పీటీసీ టీడీపీ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. ఆయన వెంట పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## ఎపిక్ సంఖ్యతో ఓటు ఎక్కడుందో తెలుసుకోండి

**లి రాష్ట్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో వార్డు సంఖ్య, పోలింగ్ కేంద్రం వివరాలు**
**లి అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**

పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : వచ్చే నెల 1వ తేదీన జరగనున్న కర్నూలు



నగరపాలక సంస్థ ఎన్నికల్లో ఓటు వేసేందుకు, తమ ఓటు ఎక్కడ ఉందో ఓటర్లు తమ చరవాణిలోనే తెలుసుకోవచ్చని అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్ హ్ట్ జూ ం : / / ం వ ఝ - వఎం.ఖజూ.స్త్రశీజ.అఅ లో ఎపిక్ కార్డు సంఖ్యను నమోదు చేస్తే, వార్డు సంఖ్యతో పాటు పోలింగ్ కేంద్రం వివరాలు వస్తాయని పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో కర్నూలు నగరపాలక సంస్థ ఎన్నికలకు సంబంధించిన ఓటరు జాబితా వివరాలు అందుబాటులో ఉండవని, ఈ ఎన్నికలకు సంబంధించిన వివరాల కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

## అప్రమత్తంగా ఉండాలి:ఏఎస్పీ



మహానంది, పల్లె వెలుగు నామినేషన్ల పూర్తి అయ్యేవరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని నంద్యాల ఏఎస్పీ సుస్మిత సూచించారు.శుక్రవారం మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలోని ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతున్న ఎంపీటీసీ నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని నంద్యాల రూరల్ సీఐ శ్రీనివాసులు రెడ్డి, ఎస్ఐ శివాంజల్ లను ఆదేశించారు.నిరంతరం అప్రమత్తంగా ఉంటూ కట్టుదిట్టమైన భద్రత నిర్వహించాలన్నారు.నామినేషన్ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా విధించిన ఆంక్షలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలన్నారు.

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com